షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 256 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 28 జూలై 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 256 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 28 july 2024 PAGES : 8 PRICE : 5/-

### తిరుపతి ఎయిర్పోర్ట్ కు శ్రీవేంకటేశ్వర ఎయిర్పోర్ట్గా మార్పు..

## ప్రతిపాదించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం




**న్యూఢిల్లీ:**

ఆంధ్రప్రదేశ్లోని తిరుపతి ఎయిర్పోర్ట్ పేరును శ్రీ వేంకటేశ్వర ఎయిర్పోర్ట్గా మార్చాలని ఏపీ సర్కార్ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని లోక్సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా పౌరవిమానయాన సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ చెప్పారు. ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని మరో రెండు ఎయిర్పోర్ట్ పేర్ల మార్పునూ ప్రతిపాదించింది. 10 రాష్ట్రాలు 22 ఎయిర్పోర్టుల పేర్ల మార్పు కోసం ప్రతిపాదనలు పంపాయని మంత్రి వెల్లడిం చారు. దర్భంగా ఎయిర్పోర్ట్ను విద్యాపతి ఎయిర్పోర్ట్ గా మార్చాలని బిహార్ కోరింది. ఉత్తరప్రదేశ్, హరియాణా, కర్ణాటక, మధ్యప్రదేశ్, మణిపూర్, ఉత్తరాఖండ్, పంజాబ్, మహారాష్ట్రలూ ఈ జాబితాలో ఉన్నాయి.




## పోలవరం పూర్తయితే మారనున్న రూపురేఖలు

- అటు బడ్జెట్లో కేంద్రం హామీ ఇవ్వడం.. ఇటు తొలి దశ నిర్మాణానికి 12 వేల కోట్ల పెండింగ్ నిధులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఏపీ ప్రభుత్వం కూడా పోలవరం నిర్మాణంపై మరింత ఫోకస్
- త్వరగా ప్రాజెక్టును పూర్తి చేసే యాక్షన్ ప్లాన్ సిద్ధం
- ఇప్పటికే అంతర్జాతీయ నిపుణుల బృందం పర్యటించి పోలవరంపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి నివేదిక
- పనుల్లో వేగం పెంచి.. వీలైనంత త్వరగా ప్రాజెక్ట్ కంప్లీట్ చేసేందుకు వడివడిగా అడుగులు

**విజయవాడ, విశాఖపట్టణం**

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి అటు బడ్జెట్లో కేంద్రం హామీ ఇవ్వడం.. ఇటు తొలి దశ నిర్మాణానికి 12 వేల కోట్ల పెండింగ్ నిధులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఏపీ ప్రభుత్వం కూడా పోలవరం నిర్మాణంపై మరింత - మిగతా3లో

# కేంద్రం కొత్తగా ఇచ్చిందేమీ లేదు!




- కొత్తగా ఏమీ లేదు.. పాతవే అడుగుతున్నాం!
- ఏపీకి రావాల్సిన నిధులు, కేటాయింపులపై చర్చ
- ఏపీ తలసరి ఆదాయం పడిపోయింది..
- కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి అంగీకరించాలని విజ్ఞప్తి
- ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఉన్నవే ఇచ్చారు
- అమరావతి పోలవరం వెనుకబడిన జిల్లాల అభివృద్ధి అన్ని విభజన చట్టంలో ఉన్నాయి
- ప్రత్యేక హోదా బదులు క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్కి సహాయం చేస్తామని చెప్పారు
- “పోలవరం, అమరావతి నాశనం అయిపోయింది. ఇండస్ట్రీలు పారిపోయాయి
- ప్రజలు ఎన్డీఏపై నమ్మకం పెట్టుకుని ఓటు వేశారు.

**ఢిల్లీ:**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ సమావేశం శనివారం నాడు జరిగింది. ఈ సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ఏపీకి రావాల్సిన నిధులు, కేటాయింపులపై చర్చించారు. అనంతరం కేంద్ర జల శక్తి శాఖ మంత్రి చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్ (సీఆర్ పాటిల్)ను కలిశారు. వీరి భేటీలో పలు కీలక విషయాలపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టుపై మాట్లాడారు. ఇటీవల పోలవరం ప్రాజెక్టుకు సహకరిస్తామని కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న సందర్భంగా పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన విషయం తెలిసిందే. పోలవరం ప్రాజెక్టుకు పూర్తిగా సహకరిస్తామని కేంద్రం ప్రకటించినందుకు ఇటీవల ఏపీ క్యాబినెట్ కూడా కృతజ్ఞతలు తెలిపింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పూర్తిస్థాయి ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ను.. చంద్రబాబు కోరారు. కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి అంగీకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం ముగిసిన అనంతరం - మిగతా3లో

# మహిళలను వేధిస్తే తాట తీయండి

- డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్
- ‘జనవాణి – జనసేన – భరోసా’ పేరిట పవన్ కళ్యాణ్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం
- తనకు వచ్చిన దరఖాస్తులను వెను వెంటనే పరిశీలించి పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు
- ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖలకు పంపి, పరిష్కారం కోసం పవన్ కళ్యాణ్ ప్రయత్నం
- దరఖాస్తులు త్వరగా పరిష్కారం..



**అమరావతి**

ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. బాధ్యతలు స్వీకరించిన దగ్గరి నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తున్నారు. తనకు వచ్చిన దరఖాస్తులను వెను వెంటనే పరిశీలించి పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ‘జనవాణి – జనసేన – భరోసా’ పేరిట పవన్ కళ్యాణ్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖలకు పంపి, పరిష్కారం కోసం పవన్ కళ్యాణ్ ప్రయత్నిస్తున్నారు. అర్జీల స్వీకరణలో భాగంగా శనివారం నాడు జనసేన పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. దీంతో దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. సమస్యలు త్వరగా పరిష్కారం - మిగతా3లో

## మీడియా సంస్థలు సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డాయి

### వాస్తవాలతో శ్వేతపత్రాలు విడుదల చేస్తుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు



టీడీపీ కూటమి ప్రభుత్వం వరుసగా విడుదల చేస్తున్న శ్వేతపత్రాలపై వైసీపీ నేతలు విమర్శలు చేస్తుండడం తెలిసిందే. దీనిపై టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు స్పందించారు. తాము అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రాలను సాక్షి వక్రీకరించిందని ఆరోపించారు. సాక్షితో పాటు వారి అనుబంధ మీడియా సంస్థలు సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డాయని అన్నారు. జగన్ తో పాటు సాక్షి, అనుబంధ మీడియా సంస్థలు సభా హక్కుల కమిటీ నోటీసులు ఎదుర్కోకతప్పదని యనమల స్పష్టం చేశారు. సభా హక్కుల కమిటీ - మిగతా3లో

### బీజేపీ శాసనసభాపక్ష నేతగా

## విష్ణుకుమార్ రాజు ఎన్నిక

**2014-19 మధ్య కూడా తనకు పార్టీ అవకాశం ఇచ్చిందన్న విష్ణుకుమార్**

**2019-24 మధ్య రాష్ట్రం దిగజారిపోయేలా పాలన సాగిందని విమర్శ**

**బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లను వేధించారని ఆరోపణ**



**ఢిల్లీ:**

బీజేపీ ఏపీ శాసనసభాపక్ష నేతగా విష్ణుకుమర్ రాజు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన విశాఖపట్నం నార్త్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన అనంతరం ఆయన మాట్లాడుతూ... 2014–19 మధ్య కూడా తనకు పార్టీ అవకాశం ఇచ్చిందని తెలిపారు. 2019–24 మధ్య రాష్ట్రం దిగజారిపోయేలా పాలన సాగించిందని మండిపడ్డారు. తనను కూడా అనేక విధాలుగా - మిగతా3లో



## ఉక్రెయిన్ పర్యటనకు మోదీ రెడీ?

- వచ్చే నెలలో ఆయన కీవ్ పర్యటనకు వెళ్లనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.
- ఈనెల ఆరంభంలో రష్యాలో రెండు రోజులు పర్యటించిన మోదీ
- ఉక్రెయిన్ జాతీయ దినోత్సవం ఆగస్టు 24న జరుగనున్నందున దాదాపు ఆ సమయానికి కాస్త అటూఇటూగా కీవ్లో మోదీ పర్యటించే అవకాశం


# కేంద్రం కొత్తగా ఇచ్చిందేమీ లేదు!

-మొదటిపేజీ తరువాయి

సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఉన్నవే ఇచ్చారని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతి పోలవరం వెనుకబడిన జిల్లాల అభివృద్ధి అన్ని విభజన చట్టంలో ఉన్నాయని చెప్పారు. ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని ప్రత్యేక హోదా బదులు క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌కి సహాయం చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. విభజన సమయంలో ఆంధ్ర తెలంగాణకు తలసరి ఆదాయం రూ. 30 వేల తేడా ఉందని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో విభజన కంటే ఎక్కువ అధ్వాన్నమైన పరిస్థితికి ఏపీ పడిపోయిందని అన్నారు. తలసరి ఆదాయం పడిపోయిందని చెప్పారు.

### ఏపీ నష్టానికి కాంగ్రెస్ కారణం

"పోలవరం, అమరావతి నాశనం అయిపోయింది. ఇండస్ట్రీలు పారిపోయాయి. ప్రజలు ఎన్డీఏపై నమ్మకం పెట్టుకుని ఓటు వేశారు. రాష్ట్ర విభజన వల్ల అన్యాయం జరిగింది కాబట్టి ఏపీ పునర్నిర్మాణం కోసం సహాయం అడుగుతున్నాం. రాష్ట్రానికి నష్టం జరగడానికి కాంగ్రెస్ పార్టీ కారణం. జగన్ ఐదేళ్ల




పాలన చూసి ప్రజలు ఎన్డీఏకి చారిత్రాత్మక విజయాన్ని ఇచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యత మాకు ఇచ్చారు. రాష్ట్రానికి రావాల్సిన పాత బకాయిలే అడుగుతున్నాం. కొత్తగా ఇచ్చింది ఏమీ లేదు. కావాలని రాజకీయం చేయడం కరెక్ట్ కాదు. స్వచ్ఛ భారత్, జల జీవన మిషన్‌లో గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం వెనుకబడి ఉంది" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

### పోలవరంపై ప్రతిపాదనలు..

"కేంద్రం ఇచ్చిన నిధులు దారి మళ్లించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలకు సమాధానం చెప్పాలి. విభజన చట్టం ప్రకారం ఏపీకి రావాల్సినవవే వచ్చాయి. రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏదో ఇచ్చారన్నట్టు కొందరు రాజకీయం చేస్తున్నారు. చట్టం రూపకల్పన చేసింది కాంగ్రెస్ పార్టీయే. విభజన కంటే గడిచిన ఐదేళ్లలో రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగింది. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ పథకాల్లో గత ఐదేళ్లలో రాష్ట్రం చాలా రాష్ట్రాల కంటే వెనుకబడింది. ఏ మంత్రిత్వ శాఖ దగ్గరకు వెళ్లిన రాష్ట్రం వెనుకబడిన గణాంకాలే చూపిస్తున్నారు. పోలవరం, అమరావతి విషయంలో కేంద్ర ప్రభుత్వం సాయం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపాను. పోలవరం ప్రాజెక్టులో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించడానికి ప్రతిపాదనలను కేంద్రం ముందు ఉంచాము. ఏపీ క్యాబినెట్ చేసిన తీర్మానాన్ని అందజేశాను. పోలవరం ప్రాజెక్టు మొదటి దశకు అవసరమైన రూ. 12,500 కోట్ల ప్రతిపాదనలను కేంద్ర మంత్రివర్గం వెంటనే ఆమోదించేలా చూడాలని కోరాను" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మహిళలను వేధిస్తే తాట తీయండి

-మొదటిపేజీ తరువాయి

అవుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ప్రజలు ధన్యవాదాలు చెబుతున్నారు. జనసేన కార్యాలయంలో ఈరోజు కొన్ని దరఖాస్తులను పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. అయితే వెంకటగిరిలో మహిళలు, వృద్ధులను వేధిస్తున్నారంటూ ఓ మహిళ పంపిన అర్జీ పవన్‌ను కదిలించింది. వెంటనే ఆయన స్పందించి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### వెల్లువలా అర్జీలు..

పవన్ కళ్యాణ్– తన కార్యాలయానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలిస్తున్నారు. ఈ రోజు ఉదయం నుంచి డిప్యూటీ సీఎం తన కార్యాలయ సిబ్బందితో కలసి ప్రతి అర్జీని చదువుతున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, పర్యావరణం, అటవీ శాఖలపై వచ్చిన దరఖాస్తులతో పాటు ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలు, ఎదురవుతున్న ఇబ్బందులను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు.

సంబంధిత శాఖల అధికారులకు పంపించడంతో పాటు, సమస్య తీవ్రతను బట్టి అధికారులతో పవన్ మాట్లాడుతున్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీ, 6వ వార్డు, ఫస్ట్ లేన్ నుంచి మహిళలు, వృద్ధులు తెలిపిన సమస్య పవన్ కళ్యాణ్‌ని కదిలించింది. ముఠాలుగా ఏర్పడిన కొందరు యువకులు బైక్‌లపై ప్రమాదకరంగా, వేగంగా వీధుల్లో సంచరిస్తూ విద్యార్థినులు, యువతులు, మహిళలను వేధిస్తున్నారని వృద్ధులను భయపెడుతున్నారని లేఖ రాశారు. అదే విధంగా యువతుల ఫొటోలు తీసి ఇంటర్నెట్‌లో పెట్టి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, మద్యం తాగి



ఇళ్ల ముందు భారీ శబ్దాలు చేస్తూ పాటలు పెట్టడం, ఇళ్లపై రాళ్లు వేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పవన్ కళ్యాణ్ ఎదుట బాధితురాలు వాపోయారు.

### కఠిన చర్యలు

సదరు యువకుల వివరాలు, బైక్స్‌పై వేగంగా సంచరిస్తున్న ఫొటోలను, వాహనాల నంబర్లను సైతం తమ ఫిర్యాదుకు జత చేశారు. ఆ యువకులను పట్టుకొని హెచ్చరిస్తే ప్రధాన రహదారికి వస్తే దాడి చేస్తామని బెదిరించారని బాధితులు పవన్ కళ్యాణ్‌కు తెలిపారు. యువకులు ఒక మహిళా ఎస్ఐను సైతం వేధించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పవన్ కళ్యాణ్ ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించి తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడుతో మాట్లాడారు. వెంకటగిరిలోని ఎన్టీఆర్ కాలనీ నుంచి వచ్చిన సమస్యను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ఆడ పిల్లలు, మహిళలను వేధించే వారిపై కఠినంగా వ్యవహరించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ సమస్యపై వెంటనే దృష్టి సారిస్తామని తగు చర్యలు తీసుకొంటామని తిరుపతి ఎస్పీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు తెలిపారు.

# పోలవరం పూర్తయితే మారనున్న రూపురేఖలు

-మొదటిపేజీ తరువాయి

ఫోకస్ పెంచింది. వీలైనంత త్వరగా ప్రాజెక్టును పూర్తి చేసే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. ఇప్పటికే అంతర్జాతీయ నిపుణుల బృందం పర్యటించి పోలవరంపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి నివేదిక తయారు చేసింది. ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రధానంగా ఉన్న అడ్డంకులేంటి..? ప్రస్తుతం ఏ మేరకు పనులు పూర్తయ్యాయి..? ఇక చేయాల్సిందేంటి..? దీనిపై చంద్రబాబు ప్రభుత్వానికి కూడా క్లారిటీ వచ్చింది. దీంతో పనుల్లో వేగం పెంచి.. వీలైనంత త్వరగా ప్రాజెక్ట్ కంప్లీట్ చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది ఏపీ ప్రభుత్వంఅధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుపై మళ్లీ దృష్టి పెట్టారు. గత ఐదేళ్లుగా ప్రాజెక్టుకు ఏర్పడ్డ అవాంతరాలను తొలగించుకుంటూ నిర్మాణాన్ని వేగం పెంచే ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి కేంద్రం నుంచి కూడా సానుకూల వాతావరణం కనిపిస్తుండటంతో ప్రాజెక్ట్ పనులు స్పీడందుకోనున్నాయి. ఇప్పటికే సీఎం చంద్రబాబు పోలవరంలో పర్యటించి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఆపై అసెంబ్లీ సాక్షిగా పోలవరం ప్రాజెక్ట్‌పై శ్వేతపత్రం విడుదల చేశారు. పోలవరం డ్యామ్ సైట్ ను పరిశీలించేందుకు అంతర్జాతీయ నిపుణుల బృందాన్ని పిలిచింది ప్రభుత్వం. అమెరికా నుంచి జియాన్ ఫ్రాంకో డి సిక్కో, డేవిడ్ బి.పాల్, కెనడా నుంచి సీన్ హించ్‌బర్గర్, రిచర్డ్ డోన్నెల్లీ ఈ ప్రాజెక్ట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నలుగురూ సాగునీటి ప్రాజెక్ట్ నిర్మాణరంగ నిపుణులు.పోలవరం డిజైన్, ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్, ఇతర నీటిపారుదల అధికారులు, సెంట్రల్ వాటర్ కమిషన్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ సాయిల్ రీసెర్చ్ స్టేషన్, ఇంకొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులతో చర్చించారు. ప్రాజెక్టు డిజైన్‌కి సంబంధించిన వివరాలు, ఇతర డాక్యుమెంట్లు అన్నీ ఈ ఎక్స్‌పర్ట్స్ టీమ్ పరిశీలించింది. జెట్ గ్రౌంటింగ్, సీపేజ్‌లపై రిపోర్ట్‌ను కూడా ప్రత్యేకంగా తయారు చేసింది. అలాగే డయాఫ్రమ్ వాల్ లాంటివి నిర్మించిన చోట నీటి ఒత్తిడి లెక్కగట్టింది. ప్రాజెక్ట్ నిర్మించిన కంపెనీలతో మాట్లాడి గ్రౌండ్ రియాలిటీ ఏంటో అర్థం చేసుకుని.. ఎక్కడ తప్పులు జరిగాయి. వాటిని ఎలా రెక్టిఫై చేయాలనేదానిపై సమగ్ర నివేదిక తయారు చేశారు. దాన్ని ఏపీ ప్రభుత్వానికి అందించారు.ప్రస్తుతం పోలవరం నిర్మాణానికి సంబంధించి టెక్నికల్ ప్రాబ్లమ్స్ చాలానే ఉన్నాయి. అప్పర్ కాపర్ డ్యామ్‌లో సీపేజీ వస్తోంది. ఇది నిర్మాణ పనులకు అవాంతరంగా



మారుతోంది. సీపేజీ వ్యవహారం పోలవరం భవితవ్యానికి సవాల్‌గా ఉండబోతోంది. మెయిన్ డ్యామ్‌లో భాగంగా నిర్మించిన డయాఫ్రమ్ వాల్ మూడేళ్ల క్రితం వచ్చిన భారీ వరదల్లో కొట్టుకుపోయింది. డయాఫ్రమ్ వాల్ స్థానంలో రింగ్ ఫెన్సింగ్ చేస్తే సరిపోతుందని మొదట కమిటీ నివేదిక ఇచ్చింది. దీనికి సమాంతరంగా మరో డయాఫ్రమ్ వాల్ నిర్మించడం ఉత్తమమని కూడా మరో నివేదిక ఇచ్చింది. ఏం చేస్తే ప్రాజెక్ట్ శాశ్వతంగా , డ్యామేజ్‌కు ఆస్కారం కాకుండా ఉంటుందనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.1941 నుంచే పోలవరం ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన ఉంది. కొన్ని దశాబ్దాలు ఆ కల కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత 2004లో ప్రాజెక్ట్ మొదలైంది. రెండు దశాబ్దాలు గడిచాయి. ఇంకా ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటూ ఉంది. 2014 రాష్ట్ర విభజన తర్వాత పోలవరం ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ అనుమతులతో పాటు ముంపు ప్రాంతాలు పెద్ద అడ్డంకిగా మారాయి. తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేయడంతో దానికి పరిష్కారం దొరికింది. కానీ.. భూసేకరణ , పునరావాసం, బాధితులకు నష్టపరిహారం రూపంలో అంచనా వ్యయం అమాంతం రెట్టింపు అయిపోయింది.ఇప్పటికి 72 శాతం ప్రాజెక్ట్‌ను పూర్తి చేశారు. వరదల కారణంగా డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. దీనికి మరమ్మతులు చేయాలంటే 436 కోట్లు ఖర్చవుతుంది. కొత్త డయాఫ్రమ్ వాల్ కట్టాలంటే దాదాపు వెయ్యి కోట్లు అదనపు ఖర్చు. ఏ విధంగా చూసినా దెబ్బతిన్న డయాఫ్రం వాల్ నిర్మాణానికి ఇప్పుడు మళ్లీ ఖర్చు చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. అంతే కాదు రెండు నుంచి నాలుగు సీజన్ల సమయం కూడా వృథా అవుతుంది. దీనికి తోడు 2019 తర్వాత కాంట్రాక్టర్లను మార్చడంతో హెడ్ వర్క్స్ నిలిచిపోయాయి. అప్పర్, లోయర్ కాఫర్ డ్యాంలు దెబ్బతిన్నాయి. గైడ్ బండ్ దెబ్బతినడంతో విద్యుత్ ప్రాజెక్ట్ నిర్మాణం కూడా ఆగిపోయింది. అటు ఏళ్లు గడవటం, ఇటు అంచనా వ్యయం పెరగడం, వరదలు ఇతర కారణాల వల్ల ప్రాజెక్ట్ కొంత దెబ్బతినడంతో ఇప్పుడు మళ్లీ మరమ్మతులు సహా కొత్త పనులను కూడా ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడింది. 2014–2019 మధ్య దాదాపు 11 వేల 5వందల కోట్లు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఖర్చు చేశారు. 24 గంటల్లో 32 వేల 315 క్యూబిక్ మీటర్లు కాంక్రీట్ పనులు చేసి గిన్నిస్ బుక్ రికార్డుకెక్కిన ఘనత కూడా ఆ ప్రాజెక్టుకు ఉంది.పోలవరంలో డయాఫ్రం వాల్ డెప్త్ 90 మీటర్లు. 20 మీటర్ల ఎత్తు, 16 మీటర్ల వెడల్పుతో అతి భారీ గేట్లు ఉంటాయి. 390 కిలోమీటర్ల పొడవైన కుడి, ఎడమ కాల్వలతో నిర్మాణపరంగా ఈ ప్రాజెక్ట్ అతి పెద్దది. ప్రాజెక్ట్ పూర్తయితే దాదాపు 7లక్షల 20వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 28 లక్షల 50 వేల మందికి తాగునీటి అవసరాలు తీరుతాయి. అంతేకాదు, పోలవరం ద్వారా 960 మెగావాట్ల విద్యుత్ ను ఉత్పత్తి చేయొచ్చు. వాటర్ టూరిజం కూడా సాధ్యపడుతుంది. పరిశ్రమలకు నీటి కొరత అనే సమస్యే ఉండదు. వరదల కారణంగా ఏటా ఏపీకి ఎంతో నష్టం కలుగుతోంది. ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తే ఆ కష్టాలు కూడా తొలగిపోతాయి. ఈ ప్రాజెక్టు సాయంతో 50 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని పక్కకు మళ్లించవచ్చు.పోలవరం పూర్తయితే లెఫ్ట్ కెనాల్, రైట్ కెనాల్ ద్వారా దాదాపు ఏపీ మొత్తానికి సాగునీరు, తాగునీటి అవసరాలు తీరుతాయి. అటు ఉత్తరాంధ్రలోని విశాఖ , ఉభయగోదావరి, కృష్ణా, ఇటు రాయలసీమకు కూడా నీటిని అందించే అవకాశముంటుంది. ఇలా వరదల సమయంలో సముద్రంపాలయ్యే 3 వేల టీఎంసీల నీటిని ఒడిసిపడితే రాష్ట్రం కరువురహితంగా మారి.. సస్యశ్యామలమవుతుంది. ఇది ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం.పోలవరం ప్రాజెక్టు ఎప్పుడో పూర్తి కావాల్సి ఉన్నా.. కేంద్రం సాయం చేయకపోవడం, ప్రభుత్వాలు మారటం, ప్రాధాన్యాలు తగ్గడంతో ఇన్నాళ్లూ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ వచ్చింది. ఇప్పుడు ఏపీతో పాటు కేంద్రంలో కూడా ఎన్డీయే కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంది. అనుమతులు, నిధులు రాబట్టడంలో పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదు. దీనికి తోడు కేంద్రం కూడా పోలవరం పూర్తి చేసే బాధ్యత తమదేనని ప్రకటించడంతో రాష్ట్ర సర్కార్ ప్రాజెక్ట్ పనుల్ని మరింత వేగం చేయాలనుకుంటోంది. ఇప్పటివరకు జరిగిన నష్టాన్ని అధిగమిస్తూ.. అంతర్జాతీయ నిపుణులు, దేశీయ ఐఐటీ నిపుణులు, సీడబ్ల్యూసీ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో సవాళ్లను అధిగమించనుంది. వీలైనంత త్వరగా పోలవరం పూర్తి చేయాలని గట్టి పట్టుదలతో ఉంది ఏపీ సర్కార్.

## మీడియా సంస్థలు సభా హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డాయి

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాటవగానే, శ్వేతపత్రాల్లోని అంశాలను వక్రీకరించిన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని వైసీపీ నేతలు తమ జేబుల్లో నింపుకున్నారన్నది వాస్తవం అని యనమల పేర్కొన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలన అనంతరం ఇప్పుడు రాష్ట్రానికి లక్షల కోట్లలో అప్పులు మిగిలాయని వ్యాఖ్యానించారు. వాస్తవాలతో శ్వేతపత్రాలు విడుదల చేస్తుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు.

## బీజేపీ శాసనసభాపక్ష నేతగా విష్ణుకుమార్ రాజు ఎన్నిక

-మొదటిపేజీ తరువాయి

ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లను వేధించారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉ ం ద ్ న ా ్ ం ్ ు .

## మేయర్ స్రవంతిని వీడని కష్టాలు

**నెల్లూరు :** నెల్లూరు మేయర్ స్రవంతిని కష్టాలు వెంటాడుతున్నాయి. మేయర్ భర్త ఐఏఎస్ సంతకం ఫోర్జరీ కేసులో నిందాతుడిగా ఉన్నారు. నేడో, రేపో అరెస్టు అన్నట్లుగా ఉంది పరిస్థితి. కష్టాల నుంచి బయటపడేందుకు మేయర్ టీడీపీ ముఖ్యనేతలను కలిసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇంతకీ నెల్లూరు మేయర్?ను అంతలా వెంటాడుతున్న ఆ సమస్యలు ఏంటి.? నెల్లూరు కార్పొరేషన్ గత ఎన్నికల్లో వైసిపి వశమైంది మొత్తం 54 డివిజన్లో క్లీన్ స్వీప్ చేసి మేయర్ పీఠాన్ని దక్కించుకునే అదృష్టం స్రవంతిని వరించింది. అయితే రాష్ట్రంలో అధికారం మారడం, కార్పొరేషన్?లో జరిగిన తప్పిదాలు ఇప్పుడు ఆమెను అటు రాజకీయంగా.. ఇటు కేసులు పరంగా ఇబ్బందులు వెంటాడుతున్నాయి. మేయర్ స్రవంతి భర్త జయవర్ధన్ కార్పొరేషన్?లో కొన్ని ఫైల్స్ సంతకాల విషయంలో ఫోర్జరీకి పాల్పడ్డారన్న విషయం రాజకీయంగా దుమారం చెలరేగింది. ఎన్నికల ముందే ఈ ఆరోపణలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక దీనిపై ప్రాథమిక విచారణ జరిగింది. ఐఏఎస్ అధికారిగా ఉన్న నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ సంతకాలు ఫోర్జరీ అయినట్లు గుర్తించారు. కార్పొరేషన్ పరిధిలో జరిగిన అపార్ట్మెంట్ల తాలూకు మార్టేజ్ ఫైల్స్?ను క్లియర్ చేసేందుకు కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన విషయం బయటపడింది. నాలుగు ఫైళ్లు ఈ విధంగా ఫోర్జరీ సంతకాలతో విడుదల అయినట్టు తెలిసింది. కమిషనర్ వికాస్ మరమ్మత్ తన సంతకం ఫోర్జరీ అయినట్టు విచారం జరపాలని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ విచారణలో ఐఏఎస్ అధికారి సంతకం ఫోర్జరీ జరిగినట్లు గుర్తించారు. ఇందులో మేయర్ స్రవంతి భర్త జయవర్ధన్.. అలాగే టౌన్ ప్లానింగ్ సిబ్బంది హస్తం ఉన్నట్టు తేలడంతో జిల్లా ఎస్పీకి నెల్లూరు కమిషనర్ ఫిర్యాదు చేశారు. విచారణ మొదలుపెట్టిన పోలీసులు మొదటగా ఏడుగురి పాత్ర ప్రధానంగా ఉన్నట్లు గుర్తించారు. మేయర్ భర్త జయవర్ధన్ ప్రోద్బలంతో ఫోర్జరీ చేసి కోట్లాది రూపాయల ఆర్జించినట్లు గుర్తించారు.ఈ స్కాంలో వీళ్లంతా కలిసి కోట్లాది రూపాయలు లబ్ధి పొందడంతో పాటు.. కార్పొరేషన్?కు రావాల్సిన కోట్ల విలువైన రుసుములు రాకుండా పోవడం గమనార్హం. విచారణలో భాగంగా జయవర్ధన్?తో పాటూ నలుగురు కార్పొరేషన్ సిబ్బంది, మరో ముగ్గురిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. జయవర్ధన్?ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయితే మేయర్ భర్త ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. చెన్నైలో ఉన్నట్టు సమాచారం రావడంతో అక్కడకు వెళ్లిన పోలీసులకు ఫలితం లేకపోయింది. కేసులు అరెస్టులనుంచి తప్పించుకునేందుకు మేయర్ స్రవంతి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రులు అలాగే నారా లోకేషన్ కూడా కలిసేందుకు స్రవంతి తనకున్న పరిచయాలతో అమరావతిలో గత కొద్ది రోజులుగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దలే తమను ఈ కష్టాల నుంచి బయటపడేయాలని విజ్ఞప్తి చేసేందుకు అమరావతిలోనే తిష్ట వేసినట్టు సమాచారం. కార్పొరేషన్?కు రావాల్సిన ఆదాయానికి గండి కొట్టడం.. సాక్షాత్తు ఐఏఎస్ అధికారి సంతకాన్ని ఫోర్ జివి చేయించి తద్వారా లబ్ధి పొందడం అనేది తీవ్రమైన కేసుగా పోలీసులు చెబుతున్నారు.

## హర్షకుమార్.. దారెటు

**కాకినాడ :** కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించిన హర్షకుమార్ ఇప్పుడు ఏ రాజకీయ పార్టీలోనూ లేరు. కాంగ్రెస్ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున కూడా పోటీ చేయలేదు. అన్ని పార్టీల నేతలనూ విమర్శిస్తున్నారు. అమలాపురం నుంచి రెండు సార్లు హర్షకుమార్ ఎంపీగా గెలిచారు. గత ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసేందుకు ప్రయత్నించినా అవకాశం దొరకలేదు. 2019లో వైసీపీలో చేరినా టిక్కెట్ రాకపోవడంతో బయటకు వచ్చారు.విశాఖలో పోర్ట్ లో పట్టుబడిన డ్రగ్స్ కేసు విచారణ ఎందుకు తెర వెనక్కి వెళ్లిపోయిందని మాజీ ఎంపీ హర్షకుమార్ ప్రశ్నించారు. రాజమండ్రిలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన కీలక అంశాలపై సంచలన ఆరోపణలు చేశారు. ప్రధాని మోదీకి విశాఖ డ్రగ్స్ కేసుతో సంబంధాలు ఉన్నట్లు తనకు అనుమానం ఉందన్నారు. కేసు దర్యాప్తును సిబిఐ ఎందుకు ఆపివేసిందని ఆయన ప్రశ్నించారు. విశాఖ డ్రగ్స్ కేసులో పార్లమెంట్ లో వివరణ ఇవ్వాలని హర్షకుమార్ డిమాండ్ చేశారు. పోలవరంలో కొత్త డయాఫ్రమ్ వాల్ కట్టాలని చంద్రబాబు ప్రభుత్వం కేంద్రాన్ని అడిగిందని హర్షకుమార్ తెలిపారు. పోలవరంలో ఇప్పటివరకు కొట్టింది అంతా వృధా అయ్యిందన్నారు. పోలవరం ప్రాజెక్టు మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని.. డయాఫ్రమ్ వాల్ సరిగ్గా కట్టకపోతే గోదావరి జిల్లాలు కొట్టుకుపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టులో సింగిల్ కాదు డబుల్ డయాఫ్రమ్ వాల్ కట్టాలన్నారు. టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకున్నాయని మండిపడ్డారు. పోలవరం ఇలా అవ్వడానికి ప్రథమ దోషి చంద్రబాబు, రెండో దోషి జగన్ అన్నారు. పోలవరంలో అక్రమాలపై జ్యుడిషియల్ ఎంక్వయిరీ వెయ్యాలని డిమాండ్ చేశారు. లేకపోతే తానే పోలవరంపై సుప్రీంకోర్టులో పిల్ వేస్తానునని స్పష్టం చేశారు. బడ్జెట్ లో అమరావతికి 15వేల కోట్లు ఎలా ఇస్తారో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పలేదని హర్షకుమార్ తెలిపారు. గ్రాంట్ గా ఇస్తారో .. లోన్ గా ఇస్తారో ఇంకా చెప్పలేదన్నారు. ల కేంద్రంలో బలం ఉండి కూడా చంద్రబాబు, పవన్ లు ప్రత్యేక హోదా సాధించలేకపోవడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు అసెంబ్లీలో హెడ్మాస్టర్ లా వ్యవహరిస్తున్నారని.. అసెంబ్లీలో సభ్యులు ఆయన నిలబడాలంటే నిల్చుంటునతన్నారు, కూర్చోమంటే కూర్చుంటున్నారన్నారు. ఢిల్లీలో జగన్ సినిమా నటుడిలా యాక్ట్ చేశారన.?. ల ఒక రౌడీషీటర్ హత్యకు ఢిల్లీ వెళ్లి జగన్ నాటకాలు ఆడారని మండిపడ్డారు. జగన్ హయాంలో అప్రజాస్వామ్య పాలన గతంలో ఏ ప్రభుత్వంలో జరగలేదన్నారు.

## మళ్లీ మొదలైన ఎర్రమట్టి దందా

**విశాఖపట్టణం :** భీమిలి ఎర్రమట్టి దిబ్బల విధ్వంసంపై గ్రీన్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తాం.. ఉత్తరాంధ్రలో ప్రకృతి విధ్వంసం, దోపిడీ ఆగాలి..' ఇది 2023 ఆగస్టు 16న వైసీపీ టార్గెట్‌గా పవన్ కల్యాణ్ చేసిన విమర్శలు..! నాడు జగన్ పార్టీ అధికారంలో ఉండగా.. ఇప్పుడు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పార్టీలు ప్రభుత్వాన్ని నడుపుతున్నాయి. అయినా సీన్ ఏ మాత్రం మారలేదంటున్నారు పర్యావరణ ప్రేమికులు. నాడు జరిగిన విధ్వంసమే కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతుందని ఆరోపిస్తున్నారు. ఏపీలో మూడు రోజులుగా ఎర్రమట్టి దిబ్బల విధ్వంసం రాజకీయ రంగు పులుముకుంది. భీమిలికి సమీపంలో ఉండే ఎర్రమట్టి దిబ్బలు 18 వేల నుంచి 20 వేల సంవత్సరాల క్రితం నాటివి. సాధారణంగా స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మట్టి దిబ్బలు ఏర్పడతాయి. అయితే ఎర్రమట్టి దిబ్బలు మాత్రం వేల సంవత్సరాల క్రితం ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన వాతావరణ మార్పులతో ఏర్పడ్డాయి. ఇలాంటి దిబ్బలు దక్షిణాసియాలో కేవలం మూడు ప్రాంతాల్లోనే ఉండగా.. అందులో భీమిలి ఒకటి. ఇంకోటి తమిళనాడులో ఉండగా.. మరొకటి శ్రీలంకలో ఉంది. అంటే ఇండియాలోనే ఈ తరహా మట్టి దిబ్బలు రెండు చోట్ల ఉన్నట్టు లెక్కా. అయితే తమిళనాడులోని టెరీ దిబ్బలతో పోల్చితే భీమిలి ఎర్రమట్టి దిబ్బల సైజ్ చాలా పెద్దది. దాదాపు 12 వందల ఎకరాల్లో ఈ మట్టిదిబ్బలు విస్తరించి ఉన్నాయి. బంగాళాఖాతంలో గడ్డకట్టుకుపోయిన నీరు కారణంగా ఈ ఎర్రమట్టి దిబ్బలు ఏర్పడ్డాయని తెలుసా? అవును?వేల సంవత్సరాల క్రితం గడ్డకట్టుకుపోయిన

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డిని కలిసిన జిల్లా కలెక్టర్, జిల్లా జడ్జి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 27)

ఒంగోలుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి, ప్రకాశం జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి శ్రీనివాసరెడ్డిని శనివారం ఎన్.ఎస్.పి గెస్ట్ హౌస్ వద్ద జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా జడ్జి ఏ భారతి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.



# ఎంపిపి కుటుంబీకుల కక్కుర్తి

## పేదల పేరుతో జగనన్న కాలనీ

## గాయంవారిపల్లిలో చేతివాటం

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 27)

ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటామన్న ప్రజా ప్రతినిధులు ఆఖరికి గృహ నిర్మాణ విషయంలో కూడా కక్కుర్తికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హనుమంతునిపాడు మండల పరిషత్ అధ్యక్షులుగా గతంలో భార్య భర్తలు పని చేశారు. ప్రస్తుతం వారి కోడలు ఎంపిపి గా పని చేస్తున్నారు. పదవి ఉంది కదా పవర్‌ను వాడుకోవాలనే దుర్బుద్ధితో పేదలకు అందాల్సిన పక్కా గృహాన్ని కూడా ప్రజాప్రతినిధులు దక్కించుకుని అవినీతికి పాల్పడ్డారు. గత పదేళ్ళుగా మండలంలోని గాయంవారిపల్లికి చెందిన గాయం బలరామిరెడ్డి కుటుంబీకులు ఎంపిపిలుగా కొనసాగుతున్నారు. ప్రభుత్వ పథకాలను వారి స్వార్థానికి ఉపయోగించుకుని అనర్హులైన వారు ప్రభుత్వ నిధులతో బినామీ పేర్లతో పక్కా గృహాన్ని నిర్మించుకున్నారు. హనుమంతునిపాడు ఎంపిపి కుటుంబీకులు మినుముల గురువయ్య పేరుతో కనిగిరి-కంభం రోడ్డులోని గాయంవారిపల్లిలో గృహ నిర్మాణ శాఖ నిధులతో గృహ నిర్మాణం చేపట్టారు. ఎంపిపి కుటుంబీకుల నిమ్మతోటలో పని చేస్తున్న గురవయ్య పేరుతో ఇళ్ళు నిర్మించుకుని దర్జాగా నివాసం ఉంటున్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు అవినీతికి పాల్పడి ప్రభుత్వ పథకాలను వారి స్వంతానికి వినియోగించుకుంటున్నారు. గాయంవారిపల్లి గ్రామంలో సిసి రోడ్డు వేయకుండానే రూ.7 లక్షలు స్వాహా చేసి అవినీతికి పాల్పడినట్లు బహిర్గతమైంది. గ్రామస్థులు , టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఈ అవినీతిని నిలదీయడంతో ఆ గ్రామంలోని హరిజనవాడ నుండి పోలేరమ్మ గుడి వరకు సిసి రోడ్డు నిర్మాణానికి ఎంపిపి కుటుంబీకులు శనివారం శ్రీకారం చుట్టారు. ప్రజాప్రతినిధులు ఇంత అవినీతికి బరితెగిస్తారా అని పంచాయతీ ప్రజలు చర్చించుకోవడం గమనార్హం. ఎంపిపి కుటుంబీకుల అవినీతి పై సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు మండల పార్టీ టీడీపీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి వెలుగు ప్రతినిధికి తెలిపారు. పేదల పేరుతో మండల








ప్రజాప్రతినిధి గృహం నిర్మించుకోవడం ఎంత వరకు సబబు అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పథకాలన్నింటిని ఎంపిపి కుటుంబీకులు దుర్వినియోగం చేశారని గాయంవారిపల్లికి చెందిన టీడీపీ నాయకులు గాయం కాశిరెడ్డి వెలుగు ప్రతినిధికి తెలిపారు. ఎంపిపి కుటుంబీకులు వారి అనుచరులు మండల స్థాయిలో చేసిన అవినీతి పై విజిలెన్స్ విచారణ జరపాలని కలెక్టర్‌ను కోరనున్నట్లు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి వెలుగు ప్రతినిధికి తెలిపారు.

# సచివాలయ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలి

### మండల స్థాయి అధికారులు తనిఖీలు చేయక పోవడంపై మంత్రి ఆగ్రహం

### కార్యాలయ దస్త్రాలు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవు

### మంత్రి డోలా హెచ్చరిక

(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, జులై 27)

ప్రజా పాలన ప్రజలకు అందుబాటులో ఉండాలని సచివాలయం సిబ్బంది తమ కార్యాలయ దస్త్రాలను సక్రమంగా నిర్వహించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సిబ్బందిని హెచ్చరించారు. శనివారం టంగుటూరు మండలం తూర్పు నాయుడు పాలెంలో తన క్యాంపు కార్యాలయం ఆయన అధికారుల సమీక్ష అనంతరం వల్లూరు సచివాలయం లో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా సిబ్బంది హాజరు పట్టీ పరిశీలించారు. సిబ్బంది విధులు, హాజరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా



4

# ఎపిపిఎస్సి డిపార్ట్మెంట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి


### డిఆర్ఓ విశ్వేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 27)

ఏపిపిఎస్సి ఆధ్వర్యంలో నిర్వహించే డిపార్ట్మెంట్ పరీక్షలను ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డిఆర్ఓ విశ్వేశ్వరరావు చెప్పారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఆగస్టు రెండవ తేదీ వరకు డిపార్ట్మెంట్ పరీక్షలు (2024 మే సెషన్) జిల్లాలోని 4 కేంద్రాలలో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని పకడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం ప్రకాశం భవనంలో ఆయన ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం జరిగింది. మార్కాపురంలోని కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్, నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చి సోషల్ యాక్షన్ ఇండియా, బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ కేంద్రాలలో జరిగే ఈ పరీక్షలకు మొత్తం 1827 మంది హాజరుకానున్నారు. ఆబ్జెక్టివ్ పరీక్షలు ఉదయం సెషన్లో 10 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం సెషన్లో 3 నుండి 5 గంటల వరకు, డిస్క్రిప్టివ్ పరీక్షలు ఉదయం సెషన్లో 10 గంటల నుండి ఒంటి గంట వరకు, సాయంత్రం. సెషన్లో 3 గంటల నుండి 6 గంటల వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షా కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా, ఆయా ప్రాంగణాలలో ప్రాథమిక వైద్య శిబిరాలు, శానిటేషన్, తాగునీటిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని డి.ఆర్.ఓ. సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని పోలీసు అధికారులకు చెప్పారు. (తరువాయి 4లో...)

# గృహ నిర్మాణశాఖ, గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షించిన మంత్రి స్వామి




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 27)

ప్రకాశం జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు, పలువురు సచివాలయ సిబ్బందితో శనివారం నాడు తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి సమీక్ష నిర్వహించారు. మొదట గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సిమెంటు ఇవ్వడంతో పాటు బిల్లులు త్వరిత గతిన చెల్లించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో సుమారు రూ. 50 కోట్ల మేర పెండింగ్ బకాయిలు ఉన్నట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. 2014-19 టీడీపీ హయాంలో నిర్మించిన ఇళ్లకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు నిలిపి వేసిందని, ఆ నిలిపివేసిన బిల్లులు కూడా త్వరలోనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. అనంతరం గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు నిర్వర్తించే బాధ్యతల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది పలు అంశాలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తమపై అజమాయిషీ చేసేది తమ మాతృశాఖలని, జీతాలు చెల్లించేది మాత్రం పంచాయతీ సెక్రటరీలు అన్నారు. అలా కాకుండా తమను పూర్తిగా మాతృశాఖలకు అనుసంధానం చేయాలన్నారు. తమకు రికార్డ్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేస్తున్నారని, జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ వాలంటరీ వ్యవస్థపై త్వరలో కమిటీ వేసి అధ్యయనం చేస్తామన్నారు. ఆ కమిటీ నివేదిక అనంతరం (తరువాయి 4లో...)

# నా తడాఖా చూపిస్తా

### రుసుం చెల్లించకుండా అక్రమ ఇసుక రవాణా కుదరదు

### రుసుం చెల్లించలేదని మూడు ఇసుక తరలింపు వాహనాల స్వాధీనం



(షణ్ముఖ వెలుగు, జరుగుమల్లి, జులై 27)

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని చర్యలు చేపట్టినప్పటికీ జరుగుమల్లి పాలేరు పరీవాహక ప్రాంతంలో జరుగుమల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్విరామంగా ఇసుక అక్రమ రవాణా చెలామణి జరుగుతూనే ఉంది. అన్ని స్థాయిలలో అధికారుల తో మాట్లాడుకుని ఇసుక అక్రమ రవాణా దారులు యథేచ్ఛగా తమ పని తాము కానిస్తున్నారు. అయితే జరుగుమల్లిలో అంతా నా యిష్టం అంటూ పోలీస్ అధికారి తన అధికారాన్ని ప్రదర్శించి శనివారం మూడు కి పైగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ లను అదుపు లోకి తీసుకున్నారు. ఇసుక అక్రమ రవాణాదారులతో పోలీసు అధికారులతో కుదిరిన ఒప్పందం మేరకు తమ వారికి రుసుం చేయకుండా ఇష్టానుసారం ఇసుక తరలింపు రవాణా కుదరదని జరుగుమల్లి ఎస్సై వెంకటేశ్వర రావు నా తడాఖా చూపిస్తా అంటూ మూడుకి పైగా ఇసుక అక్రమ రవాణా వాహనాలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# ఎపిపిఎస్సి డిపార్ట్మెంట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సెల్ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు పరీక్షా కేంద్రాలలోకి అనుమతి లేదని, విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్షా కేంద్రాలలోకి అనుమతించాలని ఆయన స్పష్టం చేశాయ. స్క్రైబ్ అవసరమైన అభ్యర్థులకు ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ సమకూర్చాలని డి.ఆర్.ఓ. చెప్పారు. పరీక్షల రోజులలో విద్యార్థులకు అవపరమైన రవాణా సౌకర్యాలపైనా దృష్టి పెట్టాలని ఆర్.టిసి అధికారులకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో డి.ఎం. హెచ్.ఓ. సురేష్ కుమార్, ఏ.పి.ఎస్.ఆర్.టి.సి. డి.ఎం. ఓ.శ్రీనివాసులు, ఏ.పి.సి.పి.డి.సి.ఎల్. డి.ఈ.ఈ. ఏ.పద్మావతి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, ఏ.పి.పి.ఎస్.సి. అధికారులు, పోలీసు, పంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలి

సచివాలయం సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సచివాలయం సిబ్బంది తమ ఉద్యోగ భాద్యతలు నిర్వహిస్తున్న వారు అధికారులు ఎవరూ తనిఖీ చేయడం లేదని నిర్లక్ష్యంగా ఉంటే ప్రభుత్వ చర్యలకు గురి అవుతారని ఆయన హెచ్చరించారు.కార్యాలయం లో దస్త్రాలను సక్రమంగా సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. కాల పరిమితి ముగిసిన అభ్యర్థులు సదరం ద్వారా శాశ్వత సర్టిఫి కేట్లు తీసుకోవాలన్నారు. నూతనంగా పించన్లు, ఇళ్ళ నిర్మాణం, రేషన్ దరఖాస్తులు తీసుకుని లబ్ధిదారులకు సేవలందించాలని కోరారు.



# గృహ నిర్మాణశాఖ, గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షించిన మంత్రి స్వామి




విధి, విధానాలు రూపొందిస్తామని అన్నారు. వచ్చే నెల పింఛన్ల పంపిణీ ఆగస్టు 1 న ఉదయం 6 గంటలకే ప్రారంభించి ఉదయం 10 గంటల లోపు పూర్తిచేయాలని సచివాలయ సిబ్బందికి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సూచించారు.

# హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 27)

ఒంగోలుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హై కోర్టు జడ్జి, ప్రకాశం జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి శ్రీనివాసరెడ్డిని శనివారం ఎన్ ఎస్ పి గెస్ట్ హౌస్ వద్ద ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.

# మంత్రి స్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 27)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ, సచివాలయం, గ్రామ వాలంటీర్ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని శనివారం జిల్లా నూతన ఎస్పీ ఏ ఆర్ దామోదర్ తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు విషయాలపై వారిరువురు చర్చించారు. శాంతిభద్రలకు ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఎస్పీకి సూచించారు.

# ఆక్రమణలపై దృష్టి సారించిన కమిషనర్ కిరణ్



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్ఛార్జి, జులై 27)

మార్కాపురం పట్టణంలో ఆక్రమణల పై కమిషనర్ కిరణ్ దృష్టి సారించారు. అందులో భాగంగా శనివారం ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు గల అన్న క్యాంటీన్ సమీపంలోని అక్రమ కట్టడాలని జెసిబి సహాయంతో కూల్చి వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులు ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఆక్రమణ తొలగింపులు ఆరంభం మాత్రమేనని, ఇంకా ఆక్రమణలను తొలగింప చేస్తామని, ఆక్రమణదారులు వారాంతట వారే తొలగించుకుంటే మంచిదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# కేఎల్ యూనివర్సిటీలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 27)

మంగళగిరిలోని కేఎల్ యూనివర్సిటీలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మిట్ట వంశీతో పాటు ఐటీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జీవీ రెడ్డి హాజరయ్యారు. కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలను అర్పించి వారి ఔన్నత్యాన్ని చాటుకున్న దేశ సేవకులను కొనియాడారు.. అదేవిధంగా తక్కువ కాలంలో ఉన్నత స్థానానికి ఎదిగిన మార్కాపురం ప్రాంతవాసి జీవీ రెడ్డి ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు అతి దగ్గరగా ఉంటూ పశ్చిమ ప్రాంత సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం అభినందనీయం. కేఎల్ యూనివర్సిటీలో భారతీయ జనతా యువ మోర్చా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పలువురు ప్రముఖులతో పాటు పెద్దారవీడు మండలం నుంచి జీవీ రెడ్డి హాజరయ్యారు.

# పెట్రోల్ బంకును ప్రారంభించిన కందుల విఘ్నేష్ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 27)

పొదిలి మున్సిపాలిటీ పరిధిలోని కాటూరి వారి పాలెం గ్రామంలో కంచర్ల వెంకట నారాయణ నూతన భారత్ పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విఘ్నేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కాటూరి నారాయణ ప్రతాప్, కాటూరి నారాయణరావు, స్వర్ణ గీత, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షుడు పోపూరి నరేష్ బాబు, మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, నాయకులు తానికొండ వెంకట్రావు, చాగంటి వెంకట్రావు, రసూల్, కాటూరి హనుమంతరావు, కాటూరి వంశీ కృష్ణ, దంతులూరి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

# రైలు కింద పడి కుదిరి సర్పంచ్ బుంగ చెంగయ్య దుర్మరణం



(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 27)

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కుదిరి గ్రామ సర్పంచ్ బుంగ చెంగయ్య శనివారం ఉదయం సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే పట్టాలపై శవమై కనిపించాడు. వెంటనే సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన వ్యక్తిని పరిశీలించారు. అనంతరం రైల్వే పోలీసులు మాట్లాడుతూ ఈరోజు తెల్లవారుజామున ఎక్స్ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తుందని, మృతి చెందిన వ్యక్తి నలుపు ప్యాంటు తెల్లచొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం బుంగ చెంగయ్య మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం నుంచి పార్లమెంట్‌కు, శాసనసభకు ఎన్నికైన నాయకులకు శుభాకాంక్షలు

## ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్








(షణ్ముఖ వెలుగు, విజయవాడ, జులై 27)

విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వై.వి.బి.రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావుల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించి, పలు నిర్ణయాలు తీసుకొని తదుపరి ఛాంబర్ నాయకత్వం నుంచి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ని, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ని సన్మానించిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, ఆంధ్రప్రదేశ్ సర్పంచ్ల సంఘం నాయకులు, కార్యకర్తలు. అనంతరం ఎమ్మెల్యేలు ఇద్దరు కూడా మేము పూజ్యులు, గురువర్యులుగా భావించే వై.వి.బి. రాజేంద్రప్రసాద్ , పంచాయతీరాజ్ ఛాంబర్ , సర్పంచుల సంఘం వల్లనే మేము ఈ స్థాయికి వచ్చామని రాజేంద్రప్రసాద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 14, 15వ ఆర్థిక సంఘాల ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 12,918 గ్రామపంచాయతీలకు పంపించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించి వేసి తన సొంత అవసరాలకు వాడుకుందని, ఆ నిధులు వెంటనే విడుదల చేయాలని మన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం ద్వారాగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేసినా గత ప్రభుత్వానికి చీమైనా కుట్టినట్టు లేదని, దాని ఫలితమే మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘోరపరాజయం పాలవ్వడానికి మన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రధాన కారణమని రాజేంద్రప్రసాద్ అన్నారు. అలాగే మన పంచాయతీరాజ్ ఛాంబర్ మరియు సర్పంచ్ల సంఘం నుంచి ఎంపీగా ఎన్నికైన కలిసెట్టి అప్పలనాయుడుకి, అనంతపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన దగ్గుపాటి ప్రసాద్‌కి, శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ఎన్నికైన గొండు శంకర్‌కి మన చాంబర్ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని, కష్టపడి నియమ నిబద్ధతతో పనిచేస్తే మంచి ఉన్నత స్థాయికి చేరుకుంటారనేది వీళ్ళను చూసి మిగతా వారందరూ నేర్చుకోవాలని రాజేంద్రప్రసాద్ అన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం ద్వారాగా మా అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్ అడుగుజాడల్లో, నాయకత్వంలో పనిచేసి నేను ఈ స్థాయికి వచ్చానని, ఒక నిబద్ధతగల నాయకుడి దగ్గర పనిచేస్తే మనం ఏవిధంగా అభివృద్ధిలోకి వస్తామో నేనే సాక్ష్యం అని, నన్ను ఈ స్థాయికి వచ్చే విధంగా ప్రోత్సహించిన రాజేంద్రప్రసాద్‌కి కృతజ్ఞున్ని అయి ఉంటానని, అలాగే పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచ్ల సంఘం కు ఎప్పుడు ఏ విధమైన సహాయ, సహకారాలు కావాలన్నా నేను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్ నాయకత్వంలో మొదటగా నేను శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులుగా పనిచేస్తున్నానని, నేను ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఎప్పటినుంచో ఉన్న కూడ - ఎమ్మెల్యేగా గెలుపొంద డానికి కావలసిన స్ఫూర్తి, ఓర్పు రాజేంద్రప్రసాద్ ద్వారానే నేర్చుకున్నానని, నా ద్వారాగా పంచాయతీ రాజ్ చాంబర్, సర్పంచుల సంఘానికి ఏ విధమైన సహాయ, సహకారాలు కావాలన్నా నేను ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు, కార్యకర్తలు ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొద్దు నిద్రలో ఒంగోలు నగరపాలక సంస్థ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 27)

క్యాలెండర్‌లో సంవత్సరాలు మారుతున్నాయి. అధికారులు మారుతున్నారు. పాలకులు మారుతున్నారు. కానీ నిర్మల్ నగర్, రాజీవ్ నగర్, సుందర్ నగర్,ఏరియాల్లో మున్సిపల్ వాటర్ సరఫరాలో మాత్రం మార్పు లేదు. ఏళ్ల తరబడి నుంచి అదే పాత పద్ధతిలో అర్ధరాత్రి, లేదా రాత్రి 2 తర్వాత సరఫరా చేస్తారు. ఒక రోజు కాదు రెండు రోజులు కాదు ఎప్పుడూ ఇదే వరస. ఎందుకు ఇలా అనే ప్రశ్న వేస్తే, కరెంటు పోయింది. లేకలోతే పైపులు లీకులు, లేకపోతే పగిలిపోయాయి. ఈ జవాబులు వస్తాయి. ఎన్ని సార్లు చెప్పినా మారరు. ఆ టైం దాకా మేలుకోలేక, నిద్ర పోలేక, జనం పడే పాట్లు చెప్పనలవి కాదు. ఇదొక బాధ అయితే అర్ధరాత్రి సమయంలో తలుపులు తెరిచి ఉంచితే ఎవడు లోనికి జొరబడి, ఏమి చేస్తారోనని అదొక భయం.అసలు ఈ దరిద్రానికి కారణం ఏమిటని లోతుగా పరిశీలిస్తే, పాతికేళ్ళ నాడు వేసిన పైపులు. అవి తుప్పు పట్టి, పగిలిపోతుం టాయి. ఆ పగిలిన వాటికి వేలు ఖర్చు పెట్టి రిపేర్లు చేయిస్తారు తప్ప కొనరు వేయరు. పోనీ ఎయిర్ వాల్వ్ అయినా సరిగ్గా ఉన్నాయంటే అదీ లేదు. ఎందుకు కొనరు? ఎందుకు కొత్తవి వేయరు అంటే అధికారులకు వచ్చే ఆదాయం పోతుందని సంస్థ సిబ్బంది అనడం గమనార్హం. ఇంతకు విషయం ఏమిటంటే అధికారులు బాగానే ఉన్నారు. పాలకులు బాగానే ఉన్నారు. ఎటొచ్చి నానా బాధలు పడుతుంది. ఏడాది తిరిగే సరికి క్యూ లో నిలబడి పన్నులు కట్టే ప్రజలు. ఏమిటి వీళ్ళు చేసిన పాపం? ఎన్నాళ్లీ నిద్ర లేకుండా జాగారం? ఎప్పుడు వీళ్ళకి ఈ దరిద్రం నుండి మోక్షం? ఇకనైనా పాలకులు,, అధికారులు మొద్దు నిద్ర నుండి మేలుకొని, సమస్యను సమూలంగా పరిష్కరించి, ఈ నరకబాధ నుంచి తమకు విముక్తి కలిగించమని నిర్మల్ నగర్ వాసులు వాపోతున్నారు.


# ఆంధ్ర కేసరి యూనివర్సిటీ అభివృద్ధికి చర్యలు చేపట్టండి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 27)

చాలా కాలం తర్వాత ప్రకాశం జిల్లాకి యూనివర్సిటీ మంజూరు చేశారని, త్వరితగతిన దాని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రాజశేఖర్ ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ డివిఆర్ మూర్తికి శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ యూనివర్సిటీలో చాలా కాలం నుంచి పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. అదేవిధంగా యూనివర్సిటీకి అటాచ్మెంట్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలన్నారు. యూనివర్సిటీకి అనుసంధానంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, లా కళాశాలను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించాలన్నారు. జిల్లా కేంద్రానికి మార్కాపురం వంద కిలోమీటర్ల దూరంలో ఉన్నందున మార్కాపురం కేంద్రంలో యూనివర్సిటీ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకొని 100 కోట్లు నిధులు కేటాయించాలన్నారు. అలాగే కేంద్ర బడ్జెట్లో ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించినందున అధికంగా నిధులు విడుదల చేయాలన్నారు. యూనివర్సిటీలో అన్ని సబ్జెక్టులకు ప్రొఫెసర్ స్థాయిలో పోస్టులను భర్తీ చేయాలని కోరారు... వైస్ - ఛాన్సర్ స్పందిస్తూ అన్ని విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్యాం, అన్వేష్, లక్ష్మణ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ఆకాంక్ష జిల్లాల కార్యక్రమ పనితీరు - పెంపుదల పై పార్లమెంటులో మాగుంట ప్రశ్న



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 27)

దేశంలో ఆకాంక్ష జిల్లాల కార్యక్రమం కింద జిల్లాల ఎంపికకు ప్రమాణాలు, పనితీరుపై పరిశోధనలు, నిధుల కేటాయింపు- వినియోగం, ఆంధ్రప్రదేశ్ లోని జిల్లాల పనితీరు, పెంపుదల గురించి ప్రభుత్వ చర్యలపై ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో శనివారం ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర గణాంకాల కార్యక్రమాల అమలు, ప్రణాళిక సాంస్కృతిక శాఖల సహాయక (స్వతంత్ర) మంత్రి, రావ్ ఇందెర్జిత్ సింగ్ సమాధానమిచ్చారు. శారీరక శ్రమపై ఆధారపడిన భూమి లేని గృహాలు, ఆరోగ్యం - పోషణ లేని గృహాలు, కుంగుబాటులోని పిల్లల, ప్రాధమికంగా వదలివేయబడిన పిల్లలు, విద్యుత్ లేని గృహాలు, వ్యక్తిగత మరుగుదొడ్లు లేని గృహాలు, నీటి వసతి లేని గ్రామీణ గృహాలు, ఉపాధ్యాయుల తక్కువ నిష్పత్తి , గ్రామీణ సడక్ యోజన లేని గ్రామాలు మొదలగు ప్రమాణాల ఆధారంగా ఆకాంక్ష జిల్లాలు ఎంపిక చేయబడునని, ఆకాంక్ష జిల్లాల కార్యక్రమాన్ని సమగ్రమైన అంచనా వేసేందుకు రెండు సంస్థలు పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొత్తం రూ.34.2 కోట్లు మంజూరు చేయగా, అందులో అల్లూరి సీతారామరాజు జిల్లాకు రూ.10.19 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాకు రూ. 5.05 కోట్లు, విశాఖపట్నం జిల్లాకు రూ. 2.93 కోట్లు, విజయనగరం జిల్లాకు రూ.5.01 కోట్లు మరియు వై.ఎస్.ఆర్. కడప జిల్లాకు రూ.11.07 కోట్లు కేటాయించబడ్డాయని, ఈ మొత్తాలను కమ్యూనిటీ గ్రంధాలయాలు, పాఠశాల భవనాలు, తరగతి గదులు, అంగన్‌వాడీ భవనాలు, వైద్యశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలతో పాటు మంచినీటి వసతులు, అంబులెన్సులు, మౌలిక వసతులు, మధ్యాన్న భోజనాలు మొదలగు వాటికి వినియోగిస్తున్నారని కేంద్ర మంత్రి తెలిపారు.

# ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి.!

## పట్టించుకోని ఏపీవో




(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, జులై 27)

కళత్తురు పంచాయతీ నందు సుమారు ఎనిమిది సంవత్సరాలుగా ఉపాధి హామీ పనులు చేపిస్తున్న తేప్పల బాలయ్య ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నటువంటి అతను కొంతమంది బంధు వర్గానికి తను అనుకున్నట్లు కలతూరు పంచాయతీలో ఏ సందర్భంలో పనికి వెళ్ళని గిరిజన కాలనీ వాళ్ళు వాళ్లకి పనికి వెళ్లిన వారికి అక్రమంగా వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసి వారికి కొంత డబ్బులు చెల్లించి వారి దగ్గర నుంచి వేసిన డబ్బులు తిరిగి తీసుకోవడం జరుగుతుంది. పనికి వెళ్లలేని వారు బంధు వర్గం భారీగా డబ్బులు జమ చేయడం జరుగుతుంది. పనికి రాని వారి ఖాతాల్లో డబ్బులు వేయడం కోసం జేసీబీతో రాత్రి సమయంలో గుంతలు కొట్టడం జరుగుతున్నది. కొంతమందికి వారు ఖాతా వివరాలు తెలియజేయకుండా వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. పై అధికారులు ఈ విషయం గురించి లోతుగా దర్యాప్తు చేసి సామాజిక తనిఖీలు చేసి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయవలసిందిగా గ్రామస్తులు కోరుకుంటున్నారు. ఇంతకుముందు కూడా కలతూరు పంచాయతీ ఉమ్మడిగా ఉన్నప్పుడు ఇతను భారీగా డబ్బులు అలాగే వసూలు చేసినట్టు సమాచారం దయచేసి అధికారులకు గ్రామస్తులు విన్న వించుకోవడం ఏమనగా దీన్ని గట్టిగా విచారణ జరిపి ఫీల్డ్ అసిస్టెంట్‌పై తగిన చర్యలు తీసుకోవా ల్సిందిగా పంచాయతీలోని బాధితులు పేర్కొంటున్నారు. పై అధికారులకు పలు సార్లు ఫిర్యాదు చేసిన నిమ్మకు నీరెక్కినట్లు ఉన్నారు. చేతివాటం చూపిస్తున్నారు. కొంత మంది గ్రామస్తులు మేమూ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అధికారులుకు పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యంగా వుంది. కళత్తూరు పంచాయతీ టీడీపీ నాయకులూ ఎంపీడిఓకి వినతి పత్రం అందించినా దర్యాప్తు జరగలేదు.

# పర్యావరణ పరిరక్షణ అవగాహనకు ఎకో క్లబ్బులు ఏర్పాటు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 27)

ఉలవపాడు గ్రామ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహలో భాగంగా పర్యావరణం గురించి దాని ప్రాముఖ్యత గురించి పాఠశాల స్థాయిలో ఎకో క్లబ్బులు ఏర్పాటు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఎకో క్లబ్ ని ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు ఈ క్లబ్‌కు చైర్మన్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చెట్లు నాటే కార్యక్రమాన్ని విద్యార్థులచే ఏర్పాటు చేయటం జరిగింది. విద్యార్థులని చెట్లను పరిరక్షించేటువంటి బాధ్యతను అప్పగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

## ప్రాణం విలువ పై అవగాహన కలిగి ఉండాలి

## కందుకూరు మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ రఫీ పిలుపు




(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జులై 27)

రోడ్డు భద్రత అందరి భాధ్యత అని ప్రతి ఒక్కరూ ప్రాణం విలువ పై అవగాహన కలిగి ఉండాలని కందుకూరు మోటర్ వాహన తనికి అధికారి ఎస్ కె ఎం డి రఫి పిలుపు ఇచ్చారు. నెల్లూరు జిల్లా ఉపరవాణా కమిషనరు బి చందర్ ఆదేశాల మేరకు ఓవి రోడ్ లోని వివేకా డిగ్రీ కళాశాల నందు రహదారి భద్రత పై అవగాహనా సదస్సులో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కందుకూరు మోటారు వాహనముల తనిఖీ అధికారి ఎస్ కె యండి రఫీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ విలువైన జీవితాన్ని కాపాడుకోవడానికి ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని అక్కడి విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలను గురించి, రోడ్డు సేఫ్టీ అంశాల గురించి, హెల్మట్ యొక్క ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువకులు అధిక స్పీడ్ తో వాహనాలు నడపడం మిక్కిలి ప్రమాదకరమని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఆర్టిఏ నిబంధనలకు లోబడి ప్రతి పౌరుడు వ్యవహరించాలని ఆయన హితవు చెప్పారు. ఈ కార్యక్రమములో భాగంగా అసిస్టెంట్ మోటారు వాహనముల తనిఖీ అధికారి యస్ మల్లికార్జున రెడ్డి ట్రాఫిక్ నిబంధనల గురించి విద్యార్థులకు వివరిస్తూ ట్రిపుల్ రైడింగ్



చేయరాదని, మోటార్ సైకిల్ నడుపునపుడు విధిగా హెల్మట్ ధరించవలెనని, ఏదైనా రోడ్ ప్రమాదం సంబవిచినప్పుడు ఆ ప్రమాదంలో ఉన్నవారిని మానవతా దృక్పథంతో స్పందించి త్వరితగతిన వారికి వైద్యసహాయము అందించే విధంగా ఉండినచో మరణముల సంఖ్య తగ్గించ వచ్చునని తెలిపారు .అనంతరం రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఏ విధంగా రక్షించాలి అనే అంశంపై 108 సిబ్బందితో కలిసి ఆయన విద్యార్థులకు డెమోను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, విద్యార్థినీ విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చనిపోయిన వారికి భారత రత్నాలు



- బతికున్న వారికి ఆకలి కేకలు, ఆత్మహత్యలలా
- గ్రామీణ పేదలను వంచించిన కేంద్రం
- బడ్జెట్లో కనిపించని రైతన్నలకు రెట్టింపు ఆదాయం
- కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్లో కేటాయింపులు
- ఈ నెల 29న కలెక్టరేట్ ఎదుట బడ్జెట్ ప్రతుల దగ్ధం
- మీడియా సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా
- జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 27)**

దేశంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం శ్రమించిన రైతు బంధువులు మాజీ ప్రధానమంత్రి చౌదరి చరణ్ సింగ్, డాక్టర్ స్వామినాథన్లకు మృతి చెందిన తర్వాత డాక్టరేట్స్ ఇచ్చి బతికున్న రైతులు, వ్యవసాయ కూలీలకు ఆకలి కేకలు, ఆత్మహత్యలు మిగిల్చేలా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలు మల్లయ్య లింగం భవనంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు నిరసనగా ఈనెల 29వ తేదీన బడ్జెట్ ప్రతులను దహనం చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే దిశగా పాలన సాగిస్తున్నాయన్నారు. అందులో భాగంగానే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను దొడ్డి దాటిన తీసుకువచ్చారన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగం నుంచి వచ్చిన నిరసనల ధాటికి తట్టుకోలేక దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పటమే కాకుండా, మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నట్టు రాతపూర్వమైన హామీ ఇచ్చారు. అంతేకాకుండా డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు రైతులకు పంటల గిట్టుబాటు ధరలను కల్పించడమే కాకుండా, వాట్ ఇస్ ద చట్టాలు చేస్తానని రాతపూర్వకమైన హామీలను ఇచ్చారన్నారు. హామీలు అయితే ఇచ్చారే తప్ప, వాటి అమలు మాత్రం అటకెక్కించారన్నారు. పేదలను కొట్టి, కార్పొరేట్లకు దోచిపెట్టేలా బడ్జెట్ ఉందని పేర్కొన్నారు.కేంద్ర బడ్జెట్ రైతాంగ, కార్మిక, పేద ప్రజలు, గ్రామీణ వ్యతిరేక సంస్కరణలను ముందుకు తీసుకెళ్లేదిగా ఉందన్నారు. ఢిల్లీలో రైతాంగం పెద్దయెత్తున ఆందోళనలు చేసిన తర్వాత కూడా కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడేందుకు వ్యవసాయ రంగాన్ని కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. స్వామినాథన్ సిఫార్సు ప్రకారం ఎంఎస్పిలో సి2ప్లస్50ని కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేసే ఏ ఒక్క చర్యా తీసుకోలేదని చెప్పారు. బడ్జెట్లో ఉత్పత్తి రంగాల కన్నా స్పెక్యులేటివ్ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలతో గ్రీస్, శ్రీలంక, పాకిస్తాన్ తరహా సంక్షోభం దేశంలోనూ తలెత్తే పరిస్థితి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ లలిత కుమారి మాట్లాడుతూ కేంద్రం వ్యవసాయ రంగం ఉత్పత్తులు ఉత్పాదకత పెంచాలని బడ్జెట్లో చెప్పిందని, కేటాయింపులు తగ్గించి ఉత్పాదక పెంచమనడం అర్థం లేనిదని అన్నారు. బీహార్కు గ్రాంటు రూపంలో భారీగా నిధులిచ్చిన కేంద్రం రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పు సమకూర్చుతామని చెప్పడం బాధాకరమన్నారు. పోలవరం ప్రాజెక్టుతోపాటు ఇతర విభజన హామీలను సాధించేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్కుమార్తో కలిసి కేంద్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఒత్తిడి తేవాలన్నారు. అఖిల భారత భూమి సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ మూడేళ్లుగా వరుసగా వ్యవసాయ అనుబంధ రంగాలకు కేంద్రం కేటాయింపుల్లో కోతపెడుతోందన్నారు. 2022-23లో కన్నా ఈ బడ్జెట్లో ఎరువుల సబ్సిడీలో 35 శాతం, ఆహార సబ్సిడీలో 25 శాతం ఉపాధి హామీ చట్టం నిధుల్లో 20 శాతం కోతపెట్టిందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు బడ్జెట్ రివైజ్ చేసి రూ.5 వేల కోట్లను కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పివిఆర్ చౌదరి మాట్లాడుతూ వాస్తవంగా భూమిపై వ్యవసాయ పంటలు సాగుచేస్తున్న కౌలు రైతులను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు.

బడ్జెట్ ప్రతుల దగ్ధం కార్యక్రమాన్ని పెద్దయెత్తున చేపట్టి కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. ఈ నెల 29 న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే బడ్జెట్ల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కంకణాల ఆంజనేయులు, పాటిబండ్ల సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1న అధికారులు అందుబాటులో ఉండాలి

### పింఛన్ పంపిణీ పై సిబ్బందికి సూచించిన ఎంపీడీవో విజయకుమార్



**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జులై 27)**

ఆగస్టు ఒకటో తేదీ ఇచ్చే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పై శనివారం తడ ఎంపిడిఓ యన్ విజయ కుమార్ పంచాయతీ కార్యదర్శులు , వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ యన్.విజయ కుమార్ పంచాయతీ కార్యదర్శులకు వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఆగస్టు 1వ తేదీన జరుగు పింఛను పంపిణీ కార్యక్రమానికి సంబంధించి తగు సూచనలు చేశారు. ఆగస్టు 1వ తేదీన మొత్తము పింఛన్లు పంపిణీ చేసే విధముగా చర్యలు తీసుకోమని తెలిపారు. ప్రతి ఒక్క అధికారి అందుబాటులో ఉండాలని ఎవరికి కూడా సెలవులు ఇచ్చే ప్రసక్తే లేదని తెలిపారు.

## ఆంధ్ర కేసరి విశ్వావిద్యాలయం నూతన ఇన్చార్జి ఉపకులపతి

### డాక్టర్ డీవీఆర్ మూర్తిని కలిసిన బెల్లం కొండ విద్యాసంస్థల యాజమాన్యం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 27)**



ఈ నెల 27వ తేదీన ఆంధ్ర కేసరి విశ్వావిద్యాలయం నూతన ఇన్చార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ డీవీఆర్ మూర్తిని శనివారం బెల్లం కొండ విద్యాసంస్థలు (బిట్స్) యాజమాన్యం డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, బెల్లంకొండ విజయలక్ష్మి, మద్దుల శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యా సంబంధిత ఆచరణాత్మక, వ్యావహారిక, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు.

## డయేరియాపై అవగాహన ర్యాలీ




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 27)**

అతిసార వ్యాధి నియంత్రణ మాసోత్సవాలు సందర్భంగా కనిగిరి పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య మెప్మా మున్సి పాలిటీ సిబ్బంది శనివారం డయేరియా పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పాల్గొని మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధులు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది పట్టణం లోని డోర్ టు డోర్ వెళ్లి సీజనల్ వ్యాధులపై సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రసాదు, ఆర్ఐ ప్రదీప్, ఆరోగ్య, మెప్మా మున్సిపాలిటీ అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ను కలిసిన బట్టు రమణారెడ్డి



**(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జులై 27)**

ఆంధ్రకేసరి వైస్ ఛాన్సలర్ను బట్టు విద్యా సంస్థల చైర్మెన్ బట్టు రమణారెడ్డి ఆంధ్రకేసరి యూనివర్సిటీ నూతన వైస్ ఛాన్సలర్గా ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను దోర్నాల బట్టు విద్యా సంస్థల అధినేత బట్టు రమణారెడ్డి, వారి కుమారుడు బట్టు రిత్విక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీలోని ప్రొఫీసర్ డీవీఆర్ మూర్తి ఛాంబర్లో కలిసి బిఇడి కళాశాల గురించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్గా ఎన్నికవ్వడం సంతోషంగా ఉందన్నారు.

ఆయనను పూలమాలవేసి శాలువాతో సన్మానించారు.

## అల్లినగరం హైస్కూలులో దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్కు ఘన నివాళులు





**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 27)**

అల్లీనగరం శ్రీ మునగనూరి వెంకట సుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.గురుస్వామి, ఉపాద్యాయులు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గురుస్వామి మాట్లాడుతూ అబ్దుల్ కలాం నిరుపేద కుటుంబంలో 1931 అక్టోబర్ 15 వ తేదీ జన్మించి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి తదుపరి శాస్త్రవేత్తగా పట్టా పొందారని ఆయన తెలిపారు. అయినప్పటికీ ఆయన తండ్రికి చేదోడు వాదోడుగా ఉండి కుటుంబ పోషణకోసం పెపర్ బాయ్ గా పనిచేశారని ఆయన కొనియాడారు. కలాం జీవితాంతం అవి వాహితుడుగా కొనసాగి ఒక గొప్ప శాస్త్ర వేత్తగా ఎదిగి ప్రజా సేవకు ఎనలేని కృషి చేశారనీ,ఆయన సేవలను గుర్తించి 2007లో దేశ రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎంపికై ఐదేళ్ళపాటు రాష్ట్రపతిగా ఎనలేని సేవలందించి పార్టీలకు, వర్గాలకు, మతాలకు,కులాలకు అతీతంగా పనిచేసి చిరస్మరనీయుడుగా పేరు పొందారనా, ఆయన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం అబ్దుల్ కలాంకు భారత రత్న బిరుదుతో సత్కరించిందన్నారు.ఆయన దేశంలోనే ఒక గొప్ప శాస్త్రవేత్తగా పేరు ప్రఖ్యాతులు గడించి చివరి రోజుల్లో పూర్తిగా పేదల సేవకే అంకితమై తుది శ్వాస విడిచిన గొప్ప వ్యక్తి అబ్దుల్ కలాం అని ప్రస్తుతించారు. ఆయన శాటీలైట్ పితామహుడిగా పేరుపొందిన గొప్ప శాస్త్రవేత్తగా అభివర్ణించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటనారాయణ, కోటేశ్వరరావు, సుజాత, ప్రకాష్రావు, శివరాం, చంద్రమోహన్, గురువయ్య, సిఆర్పి నారాయణ, బాలాజీ, రసూల్ బి, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్మెంటల్ పరీక్షలు

- ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహణ
- హాజరుకానున్న 1923 మంది అభ్యర్థులు
- ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా ఆన్లైన్లో పరీక్షలు
- హాల్ టికెట్ తో పాటు, ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరి
- సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
- డిఆర్ఓ లవన్న



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 27)**

నెల్లూరు నగర సమీపంలోని పొట్టేపాలెం వద్ద గల అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రంలో ఈనెల 28వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) డిపార్ట్మెంటల్ పరీక్షలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు డిఆర్ఓ లవన్న తెలిపారు. శనివారం నెల్లూరు కలెక్టరేట్లో ఎస్ఆర్ శంకరన్ హాలులో డిపార్ట్మెంటల్ పరీక్షల (నోటిఫికేషన్ నెంబర్ 09/2024) కోసం ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న ఆన్లైన్ పరీక్షపై సమన్వయ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్తో డిఆర్ఓ లవన్న, ఏపీపీఎస్సీ అధికారులు కృష్ణవేణి, అంజన సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు డిపార్ట్మెంట్ పరీక్షలను ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచి 5 గంటల వరకు ఆబ్జెక్టివ్ పద్ధతిలో, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 6గంటలకు కన్వెన్షనల్ పద్ధతిలో పరీక్ష జరుగుతుం దని, పరీక్షకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జొన్నవాడ రోడ్ లోని పొట్టేపాలెం అయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రంలోనే ఆరు రోజులపాటు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 1923 మంది అభ్యర్థులు డిపార్ట్మెంటల్ పరీక్షకు హాజరవుతున్నారని, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు సమకూర్చుకోవాలన్నారు. ఆన్లైన్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తున్నందున ఇంటర్నెట్, కంప్యూటర్ సాంకేతిక సమస్యలు లేకుండా ముందుగానే చూసుకోవాలన్నారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాలకు అనుమతించవద్దని, అభ్యర్థుల హాల్ టికెట్తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును తప్పనిసరిగా పరిశీలించాలని, ఏపీపీఎస్సీ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికంటే ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, లయజనింగ్ ఆఫీసర్ గయాజ్ అహ్మద్, విద్యుత్ శాఖ ఈఈ బాలచంద్ర, కలెక్టరేట్ ఏవో నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## డక్కిలి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం




**(షణ్ముఖ వెలుగు, డక్కిలి, జులై 27)**

తిరుపతి జిల్లా డక్కిలి మండలం కమ్మపల్లికి వెళ్లే దారిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే డక్కిలి మండలం శ్రీపురం పంచాయతీ, వెంగమనాయుడు పల్లి గ్రామానికి చెందిన మోర వెంకయ్య అనే వ్యక్తి కమ్మపల్లి రోడ్ నుండి తెలుగంగా కాలువ వైపు ఇంటికి వెళ్తుండగా వాగ్దేవి స్కూల్ వ్యాన్ అతి వేగంగా వచ్చి బైక్ ని డీ కొట్టగా మోర వెంకయ్య అనే వ్యక్తికి కాలు నుజ్జు నుజ్జు అవ్వడంతో అంబులెన్స్ సహాయంతో వెంకటగిరి గవర్నమెంట్ హాస్పిటల్‌కి తరలించగా మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు.

## గుండెపోటుతో ఏబీఎం కాలనీలో వ్యక్తి మృతి



**(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జులై 27)**

మండలంలోని ఏబీఎం కాలనీకి చెందిన కటికల చిన్ని బాబు (45) స్థానికంగా ఎస్సీ కాలనీలో నివాసం ఉంటూ కూలి పని ద్వారా తన జీవనాన్ని సాగిస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కటికల చిన్నిబాబు తుమ్మకర్ర నరికేందుకు వెళ్లి ఇంటికి తిరిగి రాగానే అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రభుత్వ వైద్యులు చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించడంతో మార్గమధ్యలో గుండెపోటుతో కటికల చిన్ని బాబు మృతి చెందారు.

## సోమశిల, కండలేరుకు కృష్ణాజలాల విడుదలకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి వినతి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 27)**

146 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన సోమశిల, కండలేరులో నీటి నిల్వలు 9.6 టీఎంసీలు 6.19 టీఎంసీలకు చేరుకున్నాయని మంత్రి దృష్టికి సోమిరెడ్డి తీసుకు వెళ్లారు. శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతున్న నేపథ్యంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సోమశిల, కండలేరుకు నీటిని తరలించాలని అభ్యర్థించారు. శ్రీశైలం జలాశయంలో నీటినిల్వ 3.40 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లోతో 865 అడుగుల మట్టానికి చేరిందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గుర్తు చేశారు. ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాలతో పాటు తమిళ నాడు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే కృష్ణా జలాల విడుదలకు నిర్ణయం తీసుకోవాలని లేఖ ద్వారా సోమిరెడ్డి కోరారు.

## కేంద్రంలో అవస్థలు పడుతున్న ప్రజలు

**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 27)**

హనుమంతునిపాడు మండలంలోని సచివాలయం కేంద్రాలలో ఆధార్ క్యాంప్ జరుగుతుంది. గత ఐదు రోజులుగా శీతారామ పురం, నందనవనం తిమ్మారెడ్డి పల్లి సచివాలయ కేంద్రాలలో ఆధార్ క్యాంప్ జరుగుతుంది. వీరారామాపురం గ్రామానికి చెందిన పెళ్లైయిన జంట ఆధార్‌లో అడ్రస్ మార్పుకోసం గత మూడు రోజులుగా తిరుగుతున్న అక్కడ ఉన్న ఉద్యోగి వాయిదా మీద వాయిదా వేస్తూ సోమవారం రమ్మని హుకుం జారీచేశారు. మొదటి రోజు వెళ్ళినప్పుడు అప్లికేషన్‌లో ఇంటిపేరు పూర్తిగా రాశారు ఆ అప్లికేషన్ పనికి రాదు మరల పంచాయితీ కార్యదర్శిచే వేరే అప్లికేషన్‌లో సంతకం చేయించుకొని రమ్మని పంపారు. వీర రామాపురం గ్రామం నందనవనం సచివాలయం పరిధిలో ఉంటే మీరు శీతారామపురం సచివాలయంలో చేయించుకోవాలని ఆధార్ క్యాంప్ ఉద్యోగి తప్పుడు సమాచారం తెలిపారు. కూలీ పనులకు వెల్లేవారిని రోజుల తరబడి ఇలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిప్పుకోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మాట్లాడిన ఉద్యోగి విక్రమ్ కుమార్ మరలా శనివారం తిమ్మారెడ్డి పల్లి రమ్మని బాధితులకు తెలిపారు. శనివారం తిమ్మారెడ్డి పల్లి వెళ్లగా సోమవారం హనుమంతుని పాడు రండని హుకుం జారీ చేస్తున్నారు. ఊరూరా రమ్మని తిప్పుకోవటంలో ఆంతర్యం అర్థం కావటం లేదని బాధితులు బాధ పడుతన్నారు. కూలీ పనులకు వలస వెళ్ళే వారని వారిని అలా తిప్పుకోకుండా పనిచేయమని అడిగితే మీ దిక్కున్న చోట చెప్పుకోండి నేను చేయనని విక్రమ్ కుమార్ అనే ఉద్యోగి దురుసుగా ప్రవర్తించారని నేను సాఫ్ట్ వేర్ ఉద్యోగం వదలి వచ్చాను. మీరు ఎవరికి ఫిర్యాదు చేసిన నాకేమీ భయం లేదు మేము ఇదే నియోజక వర్గంలోని రాజకీయ నాయకులము అని అన్నారని బాధితులు వాపోయారు. సోమవారం గ్రీవెన్స్‌లో ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందో లేదోనని బాధితులు బాధపడుతున్నారు.

# ఫోర్జరీ అంశం గిరిజన జాతి సమస్య కాదు



**గిరిజన పక్షపాతి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి పై విమర్శలు సరికాదు**
**అవినీతిపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలి**
**అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు గిరిజనులమని వాడుకుంటున్నారు**
**యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసి పెంచలయ్య**

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 27)**

నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయంలో సంచలనం కలిగించిన కార్పొరేషన్ కమిషనర్ల ఫోర్జరీ అంశానికి సంబంధించి అవినీతికి పాల్పడిన వారు తమ నిజాయితీని నిరూపించుకోవాల్సింది పోయి తాము గిరిజన జాతి అని చెప్పుకోవడం సరికాదని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెసి పించలయ్య పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని వెన్నెల కంటి రాఘవయ్య భవన్లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిషనర్ల సంతకాల ఫోర్జరీకి సంబంధించి ఆరోపణలు వస్తే నిజాయితీగా విచారణకు నిలబడి తమ నిజాయితీని నిరూపించుకోవాల్సిన మేయర్, ఆమె భర్త విచారణను తప్పించుకునేందుకు గిరిజనులమని చెప్పుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఫోర్జరీ అంశానికి సంబంధించి కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నారు. నిరంతరం గిరిజనులకు అండగా నిలుస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పై ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు. ఫోర్జరీకి పాల్పడిన వారు వారు వెనక నడిపించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మేయర్ కు సమస్య వచ్చినప్పుడు గిరిజన సంఘ నేతలుగా తాము అండగా నిలిచామని కానీ వైసీపీ హయంలో తమను ఇబ్బందులు పెట్టి కేసులు పెట్టినా మేయర్ కనీసం స్పందించలేదన్నారు. కానీ ఇప్పుడు మళ్లీ గిరిజనులమంటూ గిరిజన నేతలు గుర్తుకు వచ్చారా అంటూ ఆయన ప్రశ్నించారు. తప్పు చేసి గిరిజనలమని చెప్పుకుంటే సరిపోదని నిజాయితీని నిరూపించుకోవాలని పెంచలయ్య హితవు పలికారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం జిల్లా నేతలు కత్తి ఆదిశేషయ్య, తలపల చంద్రమౌళి, రాపూరి కృష్ణయ్య మాణికల మురళి, మాకాని రవీంద్ర,ఎల్లంపల్లి రమేష్, తిరువీధి సతీష్, చెంబేటి ఉష మల్లిక ప్రభావతి, ఏకొల్లు సుధాకరయ్య, తదితరులు పాల్గొన్నారు.



## గతప్రభుత్వంలో బాలినేని చేసిన అవినీతిపై సిబిఐ విచారణ చేయించేందుకు ప్రయత్నిస్తున్నా

**టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్‌రెడ్డి**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 27)**

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి ఇటీవల ఒంగోలు వచ్చి కార్యకర్తలతో మాట్లాడకుండా హడావుడిగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి నోటికి వచ్చినట్లు మాట్లాడి వెళ్ళారని, ఆయనపై గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై సిబిఐ ఎంక్వైరీ వేయించేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దిరెడ్డి సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. ఒంగోలు నగరంలోని మంగమూరు డొంకలోని తన కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో అవినీతి డాన్‌గా పేరు పొందారని అన్నారు. ప్రముఖ వ్యాపారి శిద్దా హనుమంతరావు చేత చీమకుర్తి ప్రాంతంలోని 55/3లో 12 ఎకరాలు లీజుకు తీపించుకొని అక్రమ వ్యాపారం చేసింది మాట వాస్తవంగా కాదా దీనిపై సమాధానం బాలినేని చెప్పాలన్నారు. కోటప్పకొండ చిలకలూరిపేట ప్రాంతంలోని సర్వే నెంబర్ 55/4లో 39 ఎకరాలు మీరు మీ పార్టీకి చెందిన విడదల రజిని కాజేయాలని ప్రయత్నం చేస్తే తాను గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వద్దకు వెళ్లి వినతిపత్రం సమర్పించి వాటిని ప్రభుత్వ హ్యాండోవర్ చేసిన మాట నిజమా కాదా దానికి బాలినేని సమాధానం చెప్పాలని అన్నారు. ఆర్యవైశ్యులు దేవత మూర్తితో సమానమని అలాంటి వారిపై అనేక రకాలుగా మాట్లాడడం చాలా బాధాకరమని ఆ సామాజిక వర్గం నిన్ను ఎంతో ప్రేమతో ఆప్యాయంగా ఉంటే అలాంటి వారిని వ్యతిరేకించినందుకు తగిన గుణపాఠం చెప్పారని భవిష్యత్తులో ఎప్పుడు కూడా ఒక సామాజిక వర్గాన్ని ఏ సామాజిక వర్గాన్ని అయినా సరే కించపరచి మాట్లాడటం సరైంది కాదని నీ కాలంలో జరిగిన అవినీతిపై అతి త్వరలోనే సిబిఐ ఎంక్వయిరీ కోసం కోర్టుకు వెళుతున్నట్లు సూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు.

## నర్సరీలను తనిఖీ చేసిన ఉద్యాన అధికారిణి డి సంధ్య




**(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జులై 27)**

మండలంలోని గుండ్లసముద్రం గ్రామం పరిధిలోని మిరప నారు పెంచే పూజ నర్సరీని ఉద్యాన శాఖ అధికారిని డి. సంధ్య శనివారం తనిఖీ చేశారు. నర్సరీ యజమాని మిరప విత్తనాలను ధ్రువీకరించిన డీలర్ల వద్దనే కొనాలని, అలాగే రైతులు తెచ్చిన విత్తనములు ద్వారా నారు పెంచినట్లయితే రైతులు దగ్గర నుంచి రసీదులను సేకరించి భద్రపరుచుకోవాలని, తనిఖీ చేయు అధికారి కోరిన యెడల తప్పనిసరిగా అన్ని రసీదులను చూపించవలెనని తెలియజేశారు. నర్సరీ నిర్వహణకు సంబంధించి ఉద్యాన శాఖ వారు నిర్ణయించిన అన్ని రసీదు పుస్తకాలు, రిజిస్టర్లు, నారు పెంపకం సంబంధించి అన్ని వివరాలు తగిన రిజిస్టర్‌లో పొందుపరచాలని తెలిపారు. నాణ్యమైన నారు పెంచుటకు అన్ని సస్యరక్షణ పద్ధతులు పాటించాలని అనుమతించబడిన రసాయనిక పురుగు, తెగులు మందులు మాత్రమేనన్నారు. బయో ఉత్పత్తులు నారు పెంపకంలో వాడరాదని తెలిపారు. రైతులకు ఆరోగ్యాకరమైన నారు అందించాలని, ఉద్యాన శాఖ అధికారిని తెలిపారు. ఈ కార్యక్రమం లో నర్సరీ యజమాని, గ్రామ వ్యవసాయ సహాయకులు రఘు వీర్, హెచ్ఇఓ బి ధనలక్ష్మి పాల్గొన్నారు.

## మరోసారి పట్టాలు తప్పిన గూడ్స్



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జులై 27)**

తెల్లవారుజామున గూడ్స్ ట్రైన్ బిట్రగుంట స్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది. వేకువజావున 4.40 గంటలకు నెల్లూరు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆశ్చర్యమైన విషయం ఏంటి అంటే అదే స్థానంలో మూడు రోజుల క్రితం కూడా గూడ్స్ పెట్టాలు తప్పి మూడు బోగీల వరకు తొలిగి పోయినాయి. హుటాహుటిన అధికారులు బిట్రగుంటకు అధికారులు చేరుకుని ప్రమాద సంఘటనను పరిశీలిస్తున్నారు.

## రాక్వెల్ స్కూల్ కాబినెట్ ఓత్ సెర్మనీ






**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 27)**

ఈ నెల 27వ తేదీన మార్కాపురంలోని రాక్వెల్ స్కూల్ నందు స్టూడెంట్ కేబినెట్ ఓథ్ సెర్మనీ నిర్వహించబడింది. హెడ్ బాయ్, హెడ్ గర్ల్స్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్స్ స్థానాలతో పాటు స్కూల్ కౌన్సిల్ కు జరిగిన ఎన్నికల్లో ఒకటి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మర్కాపూర్ సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, స్కూల్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థి విద్యార్థులందరూ విద్యతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. స్కూల్ డైరెక్టర్స్ వెన్న నాగార్జున రెడ్డి, సిందుజ సుర , ప్రిన్సిపాల్ నవీన్ వివిధ రంగాలలో రాణించిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందించారు. ఈ కార్యక్రమంలో రాక్వెల్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్కూల్ టీచర్స్, అడ్మిన్ స్టాఫ్ పాల్గొన్నారు.



# పార్టీలకతీతంగా అందరూ పనిచేయాలి

## ఎంపీపీ వాకా వెంకటరెడ్డి










**(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జులై 27)**

అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అందరం ప్రజా సమస్యలపై పార్టీలకు అతీతంగా పనిచేద్దామని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ కూచిపూడి పాఠశాల వెనుక ఉన్న పాడుపడ్డ బావి విద్యార్థులకు ప్రమాదకరంగా ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా ఈ బావి పూడ్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆ శాఖ ఏపీఓ రాంబాబుకు సూచించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. కలుషిత తాగునీటి విషయం పై కొందరు సభ్యులు సభ దృష్టికి తేగా తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ఏఈ జయపాల్‌ని ఆదేశించారు. గార్లపేట, వేమవరం గ్రామాలలో పారిశుధ్య సమస్యపై సభ్యులు మాట్లాడారు. మర్రిపూడి, వేమవరం, జగ్గరాజు పాలెం, నరసరాజు పాలెం తదితర గ్రామాల్లో ఆర్ అండ్ బీ రోడ్డు లు చిద్రమై పోయాయని సర్పంచ్‌లు ముప్పరాజు సుబ్బయ్య, యాళ్ళ రాణి సభ లో తెలిపారు. ఆర్ అండ్‌బీ అధికారిణి లక్ష్మి దీప్తి సమస్య పరిశీలించి చర్యలు చేపట్టుతామన్నారు. పశువుల కోసం షెడ్డు లు మంజూరు చేస్తామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పశు వైద్యాధికారిణి శ్రావణి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సుదీప, ఎంఆర్ ఓ భూపతి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ లు,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# వరి సాగు పై రైతులకు సలహాలు, సూచనలు



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 27)**

మండల పరిధిలోని బద్దిపూడి గ్రామంలో శనివారం వరి పైరు ఎందుకు ఎండిపోతుందనే విషయం గురించి మండల వ్యవసాయ అధికారిణి తిరుమల జ్యోతి రైతులకు వివరించారు. వరి పైరు నాటి 25 రోజులైంది. కొసల నుండి వరి ఎండుట గమనించారు. ఇది బోర్ వెల్స్ కింద వరి నాటుట వలన, వేసవికి నెలలో లవణాలు పైకి రావడం వలన పైరు లవణాలు ఇంజూరీకి గురై వేరు ఎండి పోవుట వలన మిగతా పోషకాలు తీసుకోలేక ఎండిపోవుట జరుగుతున్నది. దీన్ని నివారించ డానికి ఎక్కువ సార్లు నీరు పెట్టి తీసుట వలన లవణాన్ని బయటికి పంపవచ్చు అని ఆమె అన్నారు. పిక పురుగు గమనిచుట జరిగినది, దీని నివారణకు, క్లోరాంట్రినిప్రోల్ 60 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలని రైతులకు వివరించుట జరిగినది. ఈ కార్ర్యమంలో గ్రామస్తులు రైతుల పాల్గొన్నారు.

# తుమ్మగుంట అభివృద్ధికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే ఉగ్ర



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 27)**

తుమ్మగుంట పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. శనివారం తుమ్మగుంట తెలుగుదేశం పార్టీ నాయకులు ఇండ్ల రామకృష్ణ, కే రవి, శ్రీను, భాను ప్రతాప్, ప్రసాదు, ఓంకార్ వినయ్ మనోహర్, వినయ్ ఉగ్రని కలిసి గ్రామంలోని సమస్యలను ఆయన యొక్క వివరించారు. నడింపల్లి గ్రామంలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు, తుమ్మగుంట నుంచి దేవాంగ నగర్ వరకు ఆగిపోయిన తారు రోడ్డు నిర్మాణంలో వెంటనే చేపట్టాలని వారు కోరారు. తుమ్మగుంట నుంచి శ్రీరంగాపురం వరకు తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వారు కోరారు. నడింపల్లి తుమ్మగుంట కాశీ పురం విద్యార్థులకు ప్రత్యేక బస్సు నడపాలని వారు కోరారు, గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు జరగడం లేదని వారు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చించి చర్యలు చేపడతానని ఉగ్ర హామీ ఇచ్చినట్లు టిడిపి నాయకులు విలేకరులకు తెలిపారు.

# డైట్ నందు ఎకో క్లబ్ ఏర్పాటు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 27)**

శనివారం జిల్లా విద్యా శిక్షణ సంస్థ, మైనంపాడు నందు ఛాత్రోపాధ్యాయులకు శిక్షా సప్తాహ్ ఆరవ రోజు కార్యక్రమం లో భాగంగా "ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ డే" ను ఏర్పాటు చేయడం జరిగినది. ఇందులో భాగంగా చాత్రోపాధ్యాయులచే పర్యావరణ ప్రతిజ్ఞను చేయించడం జరిగింది. అలాగే సంస్థ ఇంచార్జి ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు సమక్షంలో చాత్రోపాధ్యాయులతో ఎకో క్లబ్ ను ఏర్పాటు చేయడం జరిగినది. ఇందులో ఆరు సబ్ థీమ్స్ తో ఒక్కొక్క థీమ్ కు ఒక్కొక్క లీడర్ను ఏర్పాటు చేయడం జరిగింది. దీనిని ఉద్దేశించి సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని ప్రేమించాలని అది చెట్లను పెంచడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని తెలియజేయడం జరిగింది. ఇందులో భాగంగానే "అమ్మ పేరుతో ఒక మొక్క" అనే కాన్సెప్ట్ తో డైట్, మైనంపాడు నందు మొక్కలు నాటించడం జరిగినది. ఈ మొక్కలను "ఫౌండేషన్ బర్డ్స్" అనే స్వచ్ఛంద సంస్థకు సంబంధించిన ఎన్ మాల్యాద్రి సంస్థకు సరఫరా చేయడం జరిగినది. మొక్కలను సరఫరా చేసినందుకుగాను వారికి సంస్థ తరపున కృతజ్ఞతలు తెలియజేయడం జరిగినది. ఇలాగే మున్ముందు కూడా తమ సంస్థకు సహకరించాలని కోరడం జరిగినది. అనంతరం పర్యావరణం పై ఛాత్రోపాధ్యాయులతో డిబేట్ కార్యక్రమాలు, పెయింటింగ్ పోటీలు నిర్వహించడం జరిగినది. అలాగే పర్యావరణ ప్లకార్డులను ప్రదర్శించడం జరిగినది. తదుపరి సంస్థలోని అధ్యాపకులు ఆర్ శ్రీనివాసులు, ఎమ్ రవీంద్ర ప్రసాద్ చాత్రోపాధ్యాయుల నుద్దేశించి ప్రసంగించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సంస్థలోని అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీ వివేకానందలో నైపుణ్య శిక్షణా సర్టిఫికెట్ల ప్రధానం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 27)**


ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, నాంది ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలోని స్టూడెంట్స్‌కి శిక్షణ తరగతులు 43 మందితో పూర్తి చేసుకొని ఈ నెల 27వ తేదీన సర్టిఫికెట్స్, కోర్సు మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ రవితేజ, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కేవీ రమణరెడ్డి, కళాశాల డైరెక్టర్ వై వేంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి పాల్గొని వారి చేతి మీద సర్టిఫికెట్స్, కోర్స్ మెటీరియల్స్ స్టూడెంట్స్‌కి అందించారు. డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ రవితేజ మాట్లాడుతూ ఏపీఎస్ఎస్ డీసీ ద్వారా ప్రస్తుత కంపెనీలకు అనుగుణంగా శిక్షణ రూపకల్పన చేసి తరగతులు నిర్వహిస్తున్నామని, ఇలాంటివి అందరూ స్టూడెంట్స్ సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని చెప్పారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రమణ రెడ్డి మాట్లాడుతు ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా ముఖ్యమని చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేంకటేశ్వర రావు మాట్లాడుతు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా జరిగే ట్రైనింగ్ అందరు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా కళాశాలలో జరిగిన శిక్షణ తరగతుల గురించి స్టూడెంట్స్‌కి చెబుతూ డిగ్రీ కంప్లీట్ అయిన తర్వాత ఇంటర్వ్యూలో చక్కటి మెలకువలను కనపరచడానికి ఈ తరగతులు చాలా ఉపయోగపడతాయని ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ ట్రైనర్ అయేషా , కె.సాయి ప్రణీత, నాన్ టెక్నికల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

# జేసీబీని ఢీకొన్న మోటారు బైక్

## మూలమడుగు తండ దగ్గర ఘటన

## ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

## యర్రగొండపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి క్షతగాత్రుడి తరలింపు



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 27)**

పుల్లలచెరువు మండలంలోని మూలమడుగు తండా దగ్గర శనివారం రాత్రి 8 గంటల సమయంలో జేసీబీ, హోండా షైన్ బండి ఢీకొని చేవూరి అనిల్ కుమార్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మూలమడుగు తండా నుంచి మల్లాపాలం వెళుతున్న జెసిబిని పల్నాడు జిల్లా, బొల్లాపల్లి మండలం, రెడ్డిపాలెం గ్రామానికి చెందిన చేవూరి అనిల్ కుమార్, ప్రవీణ్ కుమార్‌లు షైన్ బండి పై వస్తూ జేసీబీని ఢీకొట్టారు. దీంతో మోటర్ బైక్ మీద ఉన్న వారిలో అనిల్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా ప్రవీణ్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. సంఘటన తెలుసుకున్న వెంటనే ఎస్ఐ ఫిరోజ్ ఫాతిమా సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియ రావాల్సి ఉంది.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com